

అనకాపల్లి-నాందేడ్ ప్రత్యేక రైలు

- వచ్చే నెల 26వ తేదీ వరకు వారంలో ఒక రోజు సర్వీసు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి ప్రాంత ప్రయాణికుల సౌక ర్యార్థం దక్షిణ మధ్య రైల్వే అధికారులు మరో ప్రత్యేక రైలును ప్రవేశపెట్టారు. ఇప్పటికే అనకాపల్లి-తిరుపతి, అనకాపల్లి- సికింద్రాబాద్‌ల మధ్య వారానికి ఒకసారి ప్రత్యేక రైళ్లను నడుపు తున్న విషయం తెలిసింది. ఇప్పుడు తెలంగాణ ... మిగతా 8వ పేజీలో

సాగునీరు పుష్కలం



రైవాడ జలాశయం

జలాశయం	గరిష్ఠ నీటిమట్టం	ప్రస్తుత నీటిమట్టం
రైవాడ	114 మీటర్లు	113.39 మీటర్లు
కోనాం	101 మీటర్లు	99.6 మీటర్లు
పెద్దేరు	137 మీటర్లు	135.7 మీటర్లు
తాండవ	380 అడుగులు	376.5 అడుగులు
కల్యాణపులోవ	460 అడుగులు	450.50 అడుగులు

నిండుకుండల్లా జలాశయాలు

- పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు
- రిజర్వాయర్లలోకి వరద నీరు
- తాండవ మినహా మిగిలినవన్నీ ఫుల్
- ఇప్పటికే పలుమార్లు గేట్లు ఎత్తిన అధికారులు

అనకాపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో నైరుతి రుతుపవనాల ద్వారా జిల్లాలో వర్షాలు సమృద్ధిగా కురిశాయి. జూలైలో మినహా మిగిలిన అన్ని నెలల్లో సాధారణంకన్నా ఎక్కువ వర్షంపాతం నమోదైంది. దీంతో సాగునీటి జలాశయాల్లోకి పుష్కలంగా నీరు చేరుతున్నది. పెద్దేరు రిజర్వాయర్ ఆగస్టు చివరి వారంలోనే నిండింది. అప్పటి నుంచి అడపాదడపా గేట్లు ఎత్తి, అదనపు నీటిని దిగువకు విడిచిపెడుతున్నారు. తరువాత గత నెలలో రైవాడ, కోనాం, కల్యాణపులోవ జలాశయాలు నిండాయి. ఆయా ప్రాజెక్టుల అధికారులు ఇన్‌ఫ్లోనుబట్టి అదనపు నీటిని దిగువకు విడుదల చేస్తూ జలాశయాల్లో నీటి నిల్వలను క్రమబద్ధీకరిస్తున్నారు. వాస్తవంగా తాండవ జలాశయం కూడా పూర్తిగా నిండాల్సింది. కానీ ఆయకట్టు అధికంగా వుండడంతో రిజర్వాయర్‌లోకి ... మిగతా 8వ పేజీలో



గొలుగొండ మండలం ఏఎల్‌పురంలో వర్షం

ముసురు



నర్సీపట్నం మండలం చెట్టుపల్లిలో వర్షం

- పలు మండలాల్లో భారీ వర్షం
- మిగిలిన ప్రాంతాల్లో మోస్తరు జల్లులు

(ఆంధ్రజ్యోతి- న్యూస్‌నెట్‌వర్క్) బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్త నాల ప్రభావంతో జిల్లాలో సోమవారం ముసురు వాతావరణం నెలకొంది. ఆది వారం అర్ధరాత్రి తరువాత పలు ప్రాం తాల్లో వర్షం కురిసింది. సోమవారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై వుంది. నర్సీపట్నం, రావికమతం, బుచ్చెయ్యపేట, గొలుగొండ, చీడికాడ మండలాల్లో ఉరుములు, పిడుగులతో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. మిగిలిన మండలాల్లో జల్లులు పడ్డాయి. సాయంత్రం తరువాత కూడా ఆకాశం మేఘావృతమై అడపాదడపా మోస్తరు వర్షం కురుస్తున్నది. పట్టణ ప్రాంతాలు, మండల కేంద్రాల్లో డ్రైనేజీలు పొంగి రోడ్లపై వర్షం నీరరు ప్రవహించింది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వర్షాల కారణంగా రహదారులు మరింత దెబ్బతింటున్నాయి. గెడ్డలు, వాగులు, నదుల్లో వరద ప్రవాహం కొనసాగుతున్నది. రిజర్వాయర్లలోకి వరద నీరు చేరుతోంది. అత్యధిక శాతం చెరువులు ఇప్పటికే పూర్తిగా నిండాయి. మెట్ట ప్రాంతాల్లో వరి, చెరకు, కూరగాయ పంటలకు వర్షం మేలు చేస్తుందని రైతులు చెబుతున్నారు.

వీఆర్‌కు నక్కపల్లి సీఐ

- జాతీయ రహదారిపై మత్స్యకారుల ఆందోళన ఎఫెక్ట్
- పోలీసుల వైఫల్యమే కారణమని ఉన్నతాధికారుల నిర్ధారణ



కె.కుమారస్వామి, నక్కపల్లి సీఐ

నక్కపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పోలీసు స్టేషన్ సీఐ కె. కుమారస్వామిని వీఆర్‌కు పంపుతూ విశాఖ రేంజ్ డీఐజీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. బల్క్‌డ్రగ్ పార్కుకి వ్యతిరేకంగా సుమారు నెల రోజుల నుంచి రాజయ్యపేట కేంద్రంగా నిరసన దీక్షలు చేస్తున్న మత్స్యకారులు.. ఆదివారం ర్యాలీగా నక్కపల్లి వచ్చి, జాతీయ రహదారిపై బైఠాయించిన విషయం తెలిసిందే. సుమారు నాలుగు గంటలపాటు ఆందోళనకారులు అక్కడే వుండిపోవడంతో జాతీయ రహదారిపై ఇరువైపులా కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించి, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చివరకు కలెక్టర్, ఎస్పీ వచ్చి మాట్లాడిన తరువాతే ఆందోళన విరమించారు. మత్స్యకారులు నక్కపల్లి వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల మేర ర్యాలీ నిర్వహించి, జాతీయ రహదారిని దిగ్బంధం చేయడానికి పోలీసు శాఖ వైఫల్యంగా ప్రభుత్వం భావించింది. అంతేకాక ఇటీవల హోం మంత్రి వంగలపూడి అనిత రాజయ్యపేట వెళ్లినప్పుడు మత్స్యకారులు ఆమె కారును అడ్డుకుని కొంతసేపు ముందుకు వెళ్లనివ్వలేదు. ఈ రెండు సంఘటనలకు స్థానిక పోలీసుల వైఫల్యమే కారణమని నిర్ధారించుకుని తగు చర్యలు చేపట్టాలని రేంజ్ డీఐజీని ఆదేశించినట్టు తెలిసింది. దీంతో సీఐ కుమారస్వామిని రేంజ్ వీఆర్‌కు పంపుతూ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. సీఐని వెంటనే రిలీవ్‌చేసి, డీఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఎస్పీకి సూచించారు.



వెంకన్నపాలెం జంక్షన్ వద్ద రోడ్డుపై గొయ్యిలో నిలిచిన వర్షం నీరు

డ్రైనేజీ కాలువలు కబ్జా

- బీఎన్ రోడ్డుపైకి వర్షంనీరు
- కొద్దిపాటి వానకే వాగును తలపిస్తున్న రహదారి
- నీటి ప్రవాహంతో మరింత పాడైపోతున్న వైనం

చోడవరం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): భీమిలి- నర్సీపట్నం రోడ్డులో చోడవరం మండల పరిధిలో పలుచోట్ల ఇరువైపులా డ్రైనేజీ కాలువలు ఆక్రమణకు గురయ్యాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోవడంతో కబ్జాలు నానాటికీ పెరిగిపోతున్నాయి. మండలంలో వెంకన్నపాలెం జంక్షన్ నుంచి అంభేరుపురం వరకు రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ కాలువలను కబ్జా చేయడం, లేదంటే ఆయా దుకాణదారులు మట్టితో కప్పేయడంతో, వర్షం నీరు ప్రవహించే మార్గం లేక.. రోడ్డుపై చేరుతున్నది. కొన్నిచోట్ల పొలాల్లో నీరు కూడా రోడ్డుపైకి ప్రవహిస్తున్నది. కొద్దిపాటి వర్షం కురిసినా రహదారులు వాగుల్లా మారిపోతున్నాయి. రోడ్డుపై ఏర్పడిన భారీ గోతుల్లో రోజుల తరబడి నీరు నిలిచిపోతున్నది. ఇప్పటికే అధ్వానంగా వున్న ఈ రహదారి, మరింత ... మిగతా 8వ పేజీలో



అంభేరుపురం వద్ద పూడుకుపోయిన కాలువ

మైనింగ్‌లో అక్రమ దందా

- వే బిల్లు ఉన్నప్పటికీ డబ్బులు అడుగుతున్న వైనం
- ఆన్‌లైన్‌లో చెల్లింపులు కాకుండా నేరుగా నగదు వసూలు
- బిల్లు పేరిట చిన్నపాటి కాగితం ముక్క జారీ



సీనరేజ్ పేరుతో క్వారీ వాహనాలను తనిఖీ చేస్తున్న కాంట్రాక్టు కంపెనీ సిబ్బంది

అనకాపల్లి మండలం మార్టూరులో ఒక క్వారీ వద్ద లారీని ఆపి తనిఖీ చేస్తున్న కాంట్రాక్టు కంపెనీ సిబ్బంది. (ఇన్‌సెట్‌లో) మామిడిపాలెం చెక్ పోస్టు వద్ద ఒక లారీ నుంచి రూ.765 వసూలు చేసినట్టు సిబ్బంది ఇచ్చిన కాగితం ముక్క

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో నల్లరాయి క్వారీల వద్ద సీనరేజ్ ఫీజు వసూళ్ల ముసుగులో అక్రమ దందాకు పాల్పడుతున్నారు. క్వారీలు/ స్టోన్ క్రషర్‌ల నిర్వాకులు వే బిల్లులు జారీ చేసినా, చేయకపోయినా చెక్ గేటుల వద్ద ముక్కు పిండి మరీ డబ్బులు వసూలు చేస్తున్నారు. పైగా ఎటువంటి రశీదులు ఇవ్వకుండా చిన్నపాటి కాగితం ముక్కపై రబ్బర్ స్టాంపు వేసి చేతిలో పెడుతున్నారు.

జిల్లాలో గనుల శాఖ అనుమతులు పొందిన గ్రానైట్, రోడ్డు మెటల్, బిల్డింగ్ స్టోన్స్, గ్రావెల్ క్వారీలు 103 ఉన్నాయి. ఇవి కాకుండా అనధికారికంగా మరో వంద వరకు నల్లరాయి క్వారీలు నడుస్తున్నాయి. అనధికార క్వారీల నుంచి ప్రభుత్వానికి సీనరేజ్ రూపంలో ఒక్క రూపాయి కూడా ఆదాయం రావడం లేదు. మరోవైపు అధికార క్వారీల్లో సైతం అనుమతులకు మించి తవ్వకాలు జరుపుతున్నారు. ఈ విషయాలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం.. అక్రమ మైనింగ్, రవాణాను అరికట్టేందుకు సీనరేజ్ వసూళ్లను ప్రైవేటుకు అప్పగించాలని నిర్ణయించింది. ఆన్‌లైన్‌లో టెండర్లను ఆహ్వానించి, అందరికన్నా ఎక్కువ కోట్ చేసిన కంపెనీకి టెండర్ ఖరారుచేసింది. సదరు సంస్థ ఈ నెల ఎనిమిదో తేదీ నుంచి నిర్దేశించిన ప్రదేశాల్లో చెక్ గేట్లను ఏర్పాటు చేసి సీనరేజ్ వసూలు ... మిగతా 8వ పేజీలో

ఎకనామిక్ జోన్‌కు 20,000 ఎకరాలు

నాలుగు జిల్లాలో ఐదేసి వేల ఎకరాలు...

- విశాఖకు 50 కి.మీ.లోపు భూములు గుర్తించాలని అధికారులకు ఆదేశాలు
- శ్రీకాకుళం జిల్లాలో అయితే భోగాపురం ఎయిర్‌పోర్టుకు 30-40 కిలోమీటర్ల పరిధిలో...
- రోడ్డు కనెక్టివిటీపైనా ప్రత్యేక దృష్టి
- భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకుండా ముందుగానే విస్తరణ



మంత్రి నారా లోకేశ్ నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న కలెక్టర్లు (ఫైల్)

విశాఖపట్నం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): **ఉత్తరాంధ్రకు ఐటీ, భారీ పరిశ్రమలను తీసుకువచ్చేందుకు ప్రణాళికలు రూపొందించిన కూటమి ప్రభుత్వం, అందుకు తగిన విధంగా మౌలిక వసతుల కల్పనపై దృష్టిసారిస్తోంది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలను కలిపి కొత్తగా ఏర్పాటుచేయనున్న 'గ్రేటర్ విశాఖ ఎకనామిక్ జోన్'కు 20 వేల ఎకరాలు సేకరించనున్నారు.**

ఎకనామిక్ జోన్‌కు భూముల సేకరణపై ఆదివారం విశాఖలో నాలుగు జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ఐటీ మంత్రి నారా లోకేశ్ నిర్వహించిన సమావేశంలో చర్చించారు. విశాఖపట్నం జిల్లాలో ప్రభుత్వ భూములు ఐదు వేల ఎకరాలు లేవని అధికారులు వివరించారు. ఆనందపురం, భీమిలి, పద్మనాభం, పెందుర్తి, గాజువాక మండలాల్లో ప్రభుత్వ, డీపట్టా భూములు మూడు వేల ఎకరాల వరకూ ఉన్నాయన్నారు. మిగిలిన మూడు జిల్లాల్లో ఐదు వేల ఎకరాల చొప్పున ప్రభుత్వ భూములు ఉన్నాయని సంబంధిత అధికారులు నివేదించారు. విశాఖ నగరానికి 50 కి.మీ. పరిధిలోపు, శ్రీకాకుళం జిల్లాలో మాత్రం భోగాపురం ఎయిర్‌పోర్టు నుంచి 30 నుంచి 40 కి.మీ. పరిధిలో భూములు మాత్రమే గుర్తించాలని ఈ సమావేశంలో పాల్గొన్న ఐటీ కార్యదర్శి కాటంనేని భాస్కర్ సూచించారు. విశాఖకు సమీపంలో అయితేనే పరిశ్రమల ఏర్పాటుకు కంపెనీలు మొగ్గుచూపుతాయని, అలాగే శ్రీకాకుళం జిల్లాలో భోగాపురం ఎయిర్‌పోర్టు నుంచి అరగంటలో చేరుకునేలా ఉంటేనే పెట్టుబడుదారులు ముందుకు వస్తారని స్పష్టంచేశారు.

అలాగే రోడ్ కనెక్టవిటీపైనా మంత్రి లోకేశ్ ప్రత్యేకంగా చర్చించారు. బెంగళూరు, పూణే, హైదరాబాద్, తదితర నగరాల్లో ట్రాఫిక్ సమస్య కంపెనీలు, ఉద్యోగుల సహనానికి పరీక్ష పెడుతుందని, ఈ నేపథ్యంలో కొన్ని సంస్థలు ఏపీ వైపు చూస్తున్నందున వారికి ఇబ్బంది లేకుండా రోడ్ కనెక్టవిటీ పెంచాలని లోకేశ్ కోరారు. కంపెనీలు వచ్చిన తరువాత కాకుండా ముందుగానే రహదారుల విస్తరణ, అవసరమైన ప్రాంతాల్లో నాలుగు నుంచి ఆరులైన్ల రోడ్ల ఏర్పాటు దిశగా దృష్టిసారించాలని ఆదేశించారు. కంపెనీల కార్యకలాపాలు ప్రారంభించిన తరువాత ట్రాఫిక్ సమస్య పెరిగితే స్థానికులు, ఉద్యోగుల నుంచి వ్యతిరేకత వస్తుందని, అందుకే ముందుగానే పక్కాగా రోడ్ కనెక్టవిటీ ఉండాలన్నారు. ఉత్తరాంధ్రలో ఐదు లక్షల ఉద్యోగాలు ఇస్తామని 2024 ఎన్నికల ... మిగతా 8వ పేజీలో

275 కిలోల గంజాయి పట్టివేత

- ముగ్గురి అరెస్టు, మరో ముగ్గురు పరారీ
- కారు, రెండు బైక్‌లు సీజ్



పట్టుకున్న గంజాయి, నిందితులతో ఎస్పీ తుహిన్‌సిన్హా, డీఎస్పీ శ్రావణి, చోడవరం సీఐ అప్పలరాజు, ఎస్‌ఐలు నాగకార్తీక్, జోగారావు

చోడవరం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లా మీదుగా అనకాపల్లి జిల్లా మైదాన ప్రాంతానికి రవాణా చేస్తున్న 275 కిలోల గంజాయిని చోడవరం పోలీసులు పట్టుకున్నారు. దీనికి సంబంధించి ముగ్గురిని అరెస్టు చేశారు. మరో ముగ్గురు పరారయ్యారు. ఇందుకు సంబంధించిన వివరాలను సోమవారం ఎస్పీ తుహిన్ సిన్హా అనకాపల్లిలో మీడియాకు వెల్లడించారు.

రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌కు చెందిన చంద్రభాన్ బిష్ణోయి వినతి మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలం తుర్లగూడ గ్రామానికి చెందిన వంతల దేవదాస్ ఒడిశాలో 275 కిలోల గంజాయి కొనుగోలు చేశాడు. దీనిని ఆదివారం మధ్యాహ్నం ఎనిమిది బ్యాగుల్లో ప్యాకింగ్ చేసి, ఇద్దరూ కలిసి కారులో వేసుకుని మైదాన ప్రాంతానికి బయలుదేరారు. ఈ కారు వెనుక రెండు మోటారు సైకిళ్లపై ముంచంగిపుట్టు మండలానికి చెందిన బిసోయి మోహన్‌బాబు, బిసోయి విజయకుమార్, వంతల వెంకటరావు పైలట్లుగా వస్తున్నారు. వీరంతా పాడేరు మండలం 12వ మైలురాయి నుంచి ... మిగతా 8వ పేజీలో

త్రుటిలో తప్పిన ప్రమాదం

- శిథిలస్థితిలో కొత్తకోట పంచాయతీ భవనం
- శ్లాబ్ నుంచి పెద్ద మొత్తంలో ఊడిపడిన పెచ్చులు
- ఆ సమయంలో ఇళ్ల పన్నుల వసూళ్లకు వెళ్లిన సిబ్బంది
- లేకపోతే పెద్ద ప్రమాదమే జరిగేదని భయాందోళన



శ్లాబ్ నుంచి ఊడిపడిన పెచ్చులు



శ్లాబ్ పెచ్చులు ఊడడంతో బయటకు కనిపిస్తున్న ఇనుప ఊచలు

రావికమతం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకోట మేజరు పంచాయతీ కార్యాలయం సిబ్బందికి సోమవారం త్రుటిలో ప్రమాదం తప్పింది. శిథిలావస్థకు చేరిన ఈ భవనం శ్లాబ్ నుంచి సోమవారం ఉదయం పెద్ద పెద్ద పెచ్చులు ఊడిపడ్డాయి. ఈ సమయంలో సిబ్బంది విధి నిర్వహణలో భాగంగా బయటకు ... మిగతా 8వ పేజీలో

ఇండియన్ మెడల్ అందుకున్న శాంతారామ్



రైల్వే మంత్రి వైష్ణవ్ చేతుల మీదుగా మెడల్ అందుకున్న శాంతారామ్

మునగపాక, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మునగపాక గ్రామానికి చెందిన పెంటకోట వెంకట శ్రీధర శాంతారామ్ ఇండియన్ మెడల్ అందుకున్నారు. శాంతారామ్ ప్రస్తుతం కోల్‌కతాలో ఆర్పీఎఫ్ డీఐజీగా విధులు నిర్వహిస్తున్నారు. గుజరాత్‌లో ఆర్పీఎఫ్ జోనల్ ట్రైనింగ్ సెంటర్‌లో సోమవారం రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ రైజింగ్ డే వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా శాంతారామ్‌కు కేంద్ర రైల్వే శాఖామంత్రి అశ్విన్ వైష్ణవ్ మెడల్, ప్రశంసాపత్రం అందజేశారు. అవార్డు అందుకున్న శాంతారామ్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

బ్లాస్టింగ్ రాయి తగిలి కార్మికుడికి గాయం

▸▸ భయాందోళనల్లో దుర్గానగర్, దుర్గాకాలనీవాసులు



బ్లాసింగ్‌కు సిమెంట్ రేక్‌కు రంధ్రం పడిన దృశ్యం.(ఇన్‌సెట్‌లో) గాయపడిన కార్మికుడు

పాయకరావుపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణాన్ని ఆనుకుని జరుగుతున్న పోలవరం ఎడమ కాలువ నిర్మాణ పనుల్లో భాగంగా చేపడుతున్న బాంబు బ్లాస్టింగ్‌తో రాయి తగిలి తాండవ కార్మికుడికి గాయమైంది. ప్రస్తుతం కొండను పగులగొట్టి కాలువ తవ్వకం పనులు జరుగుతున్నాయి. అయితే కొండను పగులగొట్టేందుకు కాంట్రాక్టర్ కంట్రోల్ బ్లాస్టింగ్ చేస్తుండడంతో దురానగర్, దుర్గాకాలనీ తదితర ప్రాంతాల్లో ఇళ్లకు బీటలు వారుతున్నాయి. రాళ్లు వచ్చి ఇళ్లలో పడుతున్నాయని, ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని ఆయా ప్రాంతాల ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈక్రమంలో సోమవారం జరిగిన బాంబు బ్లాస్టింగ్‌కి రాళ్లు సమీపంలో ఉన్న ఇళ్లపై పడ్డాయి. వీటిలో ఒక రాయి తాండవ సుగర్స్ క్వార్టర్స్‌లో నివాసముంటున్న కార్మికుడు కర్రి శ్రీను తలకు తగిలింది. వెంటనే కుటుంబ సభ్యులు తుని ఏరియా ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ బాంబు బ్లాస్టింగ్ జరిగిన ప్రతిసారీ ఏం ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బాంబు బ్లాస్టింగ్‌తో ఎగిరి పడుతున్న రాళ్లు తమ ఇళ్లపై పడకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అయ్యప్పస్వాములకు ఉచిత బిక్ష ప్రారంభం

మునగపాక, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మునగపాక అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప మాలధారకులకు ఉచిత బిక్ష కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. తొలిరోజు బిక్షదాత ఆడారి సన్యాసిరావు ప్రారంభించారు. 40 రోజులు పాటు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మొల్లేటి సరళ, సత్యనారాయణ, డాక్టర్ బద్దెం సూర్యనారాయణ, సూరిశెట్టి కన్నారావు, కాండ్రేగుల జగ్గారావు, బొడ్డేడ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జనవిజ్ఞాన వేదిక కృషి అభినందనీయం : ఎంఈవో

అచ్యుతాపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సైన్స్ పట్ల విద్యార్థుల్లో అభిరుచి, జిజ్ఞాసను పెంచడానికి జన విజ్ఞాన వేదిక నిర్వహించే చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్ష దోహదం చేస్తుందని ఎంఈవో సీఆర్‌కే దేవరాయలు అన్నారు. సోమవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో చెకుముకి సైన్స్ సంబరాల వాల్‌పోస్టర్‌ని ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎనిమిది నుంచి పది విద్యార్థులకు నిర్వహించే ఈపరీక్షలు పాఠశాల స్థాయిలో అక్టోబరు 18న, మండల, పట్టణ స్థాయిలో నవంబరు ఒకటిన, జిల్లా స్థాయిలో నవంబరు 23న, రాష్ట్ర స్థాయిలో డిసెంబరు 12 నుంచి 14ల్లో నిర్వహిస్తారని తెలిపారు. ఈసమావేశంలో మారిశెట్టి వెంకట అప్పారావు, సూర్యలక్ష్మి, మారిశెట్టి కృష్ణకుమారి, లాలం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

'సేవా కార్యక్రమాల్లో ఎన్ఆర్ఐ ఆదర్శం'



తోటాడ జెడ్పీ స్కూల్‌కు టేబుల్ టెన్నిస్ బోర్డును వితరణ చేసిన ఎన్ఆర్ఐ పశుపతిరావు

మునగపాక, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఏటా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎన్ఆర్ఐ బుద్ధ పశుపతిరావు ఆదర్శంగా నిలుస్తున్నారని తోటాడ జడ్పీ హైస్కూల్ హెచ్ఎం కోట్ని రామలక్ష్మి అన్నారు. సోమవారం తోటాడ జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతిలో మండల స్థాయి విజేతలకు ప్రోత్సాహక నగదును ఆమె అందజేశారు. ఉగాధి ఫౌండేషన్ ప్రతినిధి పశుపతిరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. పలువురు విద్యార్థులకు రూ.50వేలు ప్రోత్సాహక నగదు, జ్ఞాపికలను, పాఠశాలకు రూ.50వేలు విలువ చేసే టేబుల్ టెన్నిస్ బోర్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

22 నుంచి కుసర్లపూడిలో జిల్లా స్థాయి భజన పోటీలు

రోలుగుంట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుసర్లపూడిలో ఈనెల 22వ తేదీ నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు జిల్లా స్థాయి భజన పోటీలను నిర్వహిస్తున్నట్టు గ్రామ మాజీ సర్పంచ్ గండి సింహాద్రి, గండి తాతాజీ తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా స్థానిక పాకలపాటి గురువు ఆశ్రమం వద్ద జిల్లా స్థాయి పోటీలను నిర్వహిస్తామన్నారు. ఇందులో పాల్గొనే భజన బృందాలు రూ.200లు ప్రవేశ రుసుమును చెల్లించాలని కోరారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.10,000, ద్వితీయ బహుమతి రూ.5,000వేలు, తృతీయ బహుమతి రూ.3,000వేలు చొప్పున ఇవ్వనున్నట్టు తెలిపారు. ప్రతీ బృందానికి దూరం బట్టి రవాణా ఖర్చులు ఇవ్వనున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు రూ.9652903163, 9441039181 లలో సంప్రదించాలని కోరారు.

జీవన ఎరువులపై రైతులకు అవగాహన

రావికమతం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటలకు జీవన ఎరువులు వినియోగిస్తే ఎంతో మేలని కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎన్. రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని మత్సవానిపాలెంలో సోమవారం కేవీకే శాస్త్రవేత్తల బృందం జీవన ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

తుని బస్సులతో తంటా..!

▸▸ 'పేట' బస్టాండుకు అధిక సంఖ్యలో తుని డిపో బస్సులు రాక

▸▸ బస్టాండ్ చాలక మెయిన్‌రోడ్డుపై నిలిపివేత

▸▸ తాండవ వంతెనపై కూడా అదే పరిస్థితి

▸▸ ట్రాఫిక్ సమస్యతో జనం ఇబ్బందులు

పాయకరావుపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మెయిన్ రోడ్డుపై తుని డిపో పీటీడీ బస్సులు నిలిపేస్తుండడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీంతో పట్టణవాసులు ట్రాఫిక్‌లో చిక్కుకొని అవస్థలు పడుతున్నారు.

స్థానిక పీటీడీ బస్టాండ్‌కి మధ్యాహ్న సమయంలో తుని డిపో బస్సులు ఒకేసారి అధికంగా వస్తుంటాయి. అలాగే అనకాపల్లి డిపోకి చెందిన పల్లె వెలుగు బస్సులు వస్తాయి. దీంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్నది. బస్టాండ్ ప్రాంగణం, తాండవ వంతెన, మెయిన్ రోడ్డు పక్కన తుని డిపో బస్సులు నిలిపివేయడంతో ట్రాఫిక్‌కు ఇబ్బంది ఏర్పడుతున్నది. మధ్యాహ్నం బస్సు డ్రైవర్, కండక్టర్లు భోజనం చేసిన తర్వాత మళ్లీ సర్వీసులు ప్రారంభమవుతాయి. ఇదే సమయంలో అనకాపల్లి డిపో నుంచి వచ్చే బస్సులు కూడా భోజన విరామం కోసం కొద్దిసేపు బస్టాండ్‌లో నిలిచి ఉంటాయి. దీంతో ప్రతిరోజూ మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు పాయకరావుపేట బస్టాండ్ ఆవరణ బస్సులతో



బస్టాండ్‌లో ఖాళీ లేక తాండవ వంతెనపై నిలుపుతున్న తుని డిపో బస్సులు



మధ్యాహ్న సమయంలో బస్టాండ్ ఎదుట మెయిన్‌రోడ్డులో రోజూ ఇదే పరిస్థితి

నిండిపోతోంది. బస్టాండ్‌లో ఆరు, లేదా ఏడు బస్సులు కంటే ఎక్కువ నిలిపి ఉంచే అవకాశం లేకపోవడంతో అదనంగా వచ్చే బస్సులు మెయిన్‌రోడ్డుపై నిలిపివేస్తున్నారు. అసలే బస్టాండ్ పరిసరాల్లో పదుల సంఖ్యలో ఆటోలు నిలుపుతుంటారు. దీంతో బస్సులు మెయిన్ రోడ్డుపైనే నిలిపి వేయాల్సిన పరిస్థితి నెలకొంటుంది. బస్సులు వెళ్లేంతవరకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మధ్యాహ్న సమయంలో పీటీడీ బస్టాండ్ వద్ద ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కొత్త గురువులతో బడులకు కళ



వేంపాడు జడ్పీ హైస్కూల్‌లో విధుల్లోకి చేరిన నూతన ఉపాధ్యాయులు



ఎంఈవో రామారావుకు జాయినింగ్ ఆర్డర్స్ ఇస్తున్న కొత్త టీచర్లు

నక్కపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీని కూటమి సర్కారు నెరవేర్చింది. మెగా డీఎస్సీ ద్వారా నియమితులైన నూతన ఉపాధ్యాయులు సోమవారం ఆయా పాఠశాలల్లో విధుల్లోకి చేరారు. మండలంలోని పలు పాఠశాలలు, హైస్కూళ్లల్లో 47 మంది కొత్త ఉపాధ్యాయులు కొలువుతీరారు. వారందరికీ పాఠశాల గురువులు స్వాగతం పలికారు. నక్కపల్లిలో నూతనంగా నియమితులైన ఉపాధ్యాయులనుద్దేశించి ఎంఈవో నరేశ్ మాట్లాడుతూ అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులకు మంచి గుర్తింపు లభిస్తుందని చెప్పారు. వేంపాడు, జానకయ్యపేట, పెదబోదిగల్లం, నక్కపల్లి, చినదొడ్డిగల్లు, వేంపాడు, గొడిచెర్ల, ఉద్దండపురం, డీఎల్‌పురం, రమణయ్యపేట, రాజయ్యపేట తదితర పాఠశాలలకు నియమితులైన నూతన ఉపాధ్యాయులను ఆయా పాఠశాలల హెచ్ఎంలు జాయిన్ చేసుకున్నారు.

కోటవురట్లలో..

మండలంలో పాఠశాలలకు కొత్త ఉపాధ్యాయులు సోమవారం జాయిన్ అయ్యారు. మండలంలో 16 మంది స్కూల్ అసిస్టెంట్‌లు ఆయా పాఠశాలలో ప్రధానోపాధాయులకు ఆర్డర్లు ఇచ్చి ఉద్యోగాల్లో చేరారు. అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో చేరారు. కొత్త టీచర్లకు సంఘాల ప్రతినిధులు శుభాకాంక్షలు తెలియజేశారు.

పాయకరావుపేటలో..

మండలంలో వివిధ పాఠశాలల్లో కొత్త ఉపాధ్యాయులు సోమవారం చేరారు. మండలంలో 32 మంది ఎస్ఏలు విధుల్లో చేరాల్సి ఉండగా 27 మంది ఉపాధ్యాయులు చేరారు. ఈ సందర్భంగా ఎంఈఓ-2 రమేష్‌బాబు మాట్లాడుతూ మండలంలో ఉన్న 56 ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్‌జీటీ, ఎస్ఏలు కలిపి ప్రస్తుతం 141 మంది ఉండగా డీఎస్సీ-2025లో ఉద్యోగాలు సాధించిన 32 మంది రావాల్సి ఉందన్నారు. సోమవారం 27 మంది వచ్చి విధుల్లో చేరారని, మిగిలిన వారు కూడా త్వరలో వస్తారని ఆయన తెలిపారు.

అధ్వానంగా అప్పన్నపాలెం-చీమలాపల్లి రోడ్డు

▸▸ చినుకు పడితే చిత్తడే

▸▸ రోడ్డు కిరువైపులా పెరిగిన తుప్పలు

▸▸ చర్యలు తీసుకోవాలని కోరుతున్న ప్రజలు

అచ్యుతాపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పన్నపాలెం-చీమలాపల్లి రోడ్డు అధ్వానంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అప్పన్నపాలెం జంక్షన్ నుంచి చీమలాపల్లి వరకు మూడు కిలోమీటర్ల మట్టి రోడ్డు ఉంది. తెలుగుదేశం హయాంలో రాకపోకలకు అనువుగా మెటల్ రోడ్డు వేశారు. అయితే వైసీపీ ఐదేళ్ల పాలనలో ఈ రోడ్డు గురించి అసలు పట్టించుకోకపోవడంతో మెటల్ అంతా పోయి కేవలం మట్టి రోడ్డు మాత్రమే మిగిలింది. ఈమార్గం గుండా చీమలాపల్లి, బంగారయ్యపాలెంకి చెందిన వారు ప్రయాణించేవారు. వీరు అచ్యుతాపురం రావాలంటే ఈదారి గుండానే రావాలి. రోడ్డు పూర్తిగా గోతులమయం కావడంతో పాటు రోడ్డుకిరువైపులా భారీగా తుప్పలు పెరిగిపోయాయి. దీంతో పాములు రోడ్డుపై సంచరిస్తుండడంతో వాహన చోదకులతో పాటు పాదచారులు భయపడుతున్నారు. రాత్రి పూట ఒక్కరు ఈరోడ్డు గుండా వెళ్లడానికి బీతిల్లుతున్నారు. చీమలాపల్లి, బంగారయ్యపాలెంకి చెందిన వారు దూరం ఎక్కువైనా మడుతూరు జంక్షన్ మీదుగా అచ్యుతాపురం వస్తున్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకొని రోడ్డుకిరువైపులా తుప్పలు నరికించడంతో పాటు రాకపోకలకు అనువుగా రోడ్డును వేయాలని కోరుతున్నారు.



బంగారయ్యపాలెం వద్ద బురదమయమైన రోడ్డు

కల్తీ మద్యంపై సీబీఐ విచారణ జరిపించాలి : ధర్మశ్రీ

ఎలమంచిలి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కల్తీ మద్యంపై సీబీఐ విచారణ చేయించాలని మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. సోమవారం పట్టణంలో కల్తీ మద్యానికి వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బెల్ట్ దుకాణాలను అరికట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అనంతరం పలు డిమాండ్లతో ఉన్న వినతిపత్రాన్ని ఎక్సైజ్ శాఖ ఇన్‌చార్జి సీఐ జ్ఞానేశ్వరికి అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు బొడ్డేడ ప్రసాద్, ఎంపీపీ బోదెపు గోవింద్, బొద్దపు యర్రయ్యదొర, దాసరి కుమార్, కొల్లి త్రినాథ్, పలివెల అమృతవల్లీ, దూది నరసింహమూర్తి, రాపేటి సంతోష్, కోడిగుడ్డు రమణబాబు పాల్గొన్నారు.

పాయకరావుపేటలో..

కూటమి ప్రభుత్వం నకిలీ మద్యం తయారీని కుటీర పరిశ్రమలా మార్చిందని మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు విమర్శించారు. సోమవారం వైసీపీ చేపట్టిన పోరుబాట కార్యక్రమంలో భాగంగా పట్టణంలో వై జంక్షన్ నుంచి ఎక్సైజ్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐకి కంబాల జోగులు, వైసీపీ నేతలు బొడ్డేడ ప్రసాద్, చిక్కాల రామారావు, వీసం రామకృష్ణ తదితరులు వినతిపత్రం



ఎలమంచిలిలో సీఐ జ్ఞానేశ్వరికి వినతిపత్రం అందజేస్తున్న ధర్మశ్రీ, ప్రసాద్, ఎంపీపీ గోవింద్

అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు ధనిశెట్టి బాబూరావు, దగ్గుపల్లి సాయిబాబా, ధనిశెట్టి బాబి, ఇసరపు తాతారావు, జగతా శ్రీను, సూరకాసుల గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నోచుకోని అందాల తీరం

▸▸ వాడపాలెం సముద్రతీరంలో కనీస వసతులు కరువు

▸▸ నిత్యం పర్యాటకులు తాకిడి.. సదుపాయాలు లేక అవస్థలు

▸▸ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలంటున్న మత్స్యకారులు

రాంబిల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆహ్లాదకర వాతావరణం, పచ్చని కొబ్బరి చెట్లు, మెట్టపై గంగాదేవి ఆలయం ఇలా ఎన్నో ప్రత్యేకతలు వాడపాలెం సముద్ర తీరం సొంతం. ఎంతో సుందరమైన తీరానికి ఆదివారం, సెలవు దినాల్లో అనకాపల్లి, విశాఖ జిల్లాల నుంచి వచ్చిన పర్యాటకులు పోటెత్తుతారు. అయితే తీరంలో కనీస వసతులు లేకపోవడంతో పర్యాటకులు నిరుత్సాహానికి గురవుతున్నారు.

రాంబిల్లికి రెండు కిలోమీటర్లు దూరంలో వాడపాలెం సముద్రతీరం ఉంది. ఈ తీరంలో ఇసుక తెన్నెలు, కనువిందు చేసే కొబ్బరి తోటలు, సరుగుడు



: పర్యాటకులను కనువిందు చేసే గంగమ్మ ఆలయం



వాడపాలెం సముద్రతీరం

చెట్లు, మెట్టపై కొలువై ఉన్న గంగాదేవి అమ్మవారి ఆలయం, శివపార్వతుల విగ్రహాలు ఉన్నాయి. ప్రతి ఏటా మాఘపౌర్ణమి, కార్తీకమాసం, మహాశివరాత్రి పర్వదినాల్లో రెండు జిల్లాలు నలుమూలలు నుంచి వేలాది మంది భక్తులు ఇక్కడకు వచ్చి సముద్ర స్నానాలు ఆచరిస్తారు. గంగాదేవి అమ్మవారిని, శివ,పార్వతులను దర్శించుకుంటారు. సెలవు దినాల్లోను, ప్రతీ ఆదివారం ఈ తీర ప్రాంతం పర్యాటకులతో కిటకిటలాడుతుంది. ఇక్కడ సినిమా, షాట్‌ఫిల్మ్స్ షూటింగ్‌లు ఎక్కువగా జరుగుతుంటాయి. ఎస్ఈజడ్, నేవల్‌బేస్ ఉండడంతో వేలాది మంది ప్రతి ఆదివారం, సెలవు దినాల్లో ఇక్కడకు వస్తుంటారు. సేదదీరేందుకు ఎటువంటి సదుపాయాలు లేకపోవడంతో నిరుత్సాహానికి గురవుతున్నారు. పర్యాటకులు కూర్చొడానికి పగోడాలు గానీ, బెంచీలు గానీ లేవు. తాగేందుకు నీటి సదుపాయం లేదు. వాడపాలెం సముద్ర తీరాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

గూగుల్‌తో విశాఖలో టెక్ విప్లవం

▸▸ రాష్ట్ర రోడ్లు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ప్రగడ నాగేశ్వరరావు

అచ్యుతాపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గూగుల్ అడుగుతో విశాఖపట్నంలో టెక్నాలజీ విప్లవం రానున్నదని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇంతవరకు సిటీ ఆఫ్ డెస్టినీగా ఉన్న విశాఖపట్నం ఇకపై ఏఐ, డిజిటల్ సిటీకి రాజధానిగా మారనుందన్నారు. దీనివల్ల ఏపీ భవిష్యత్‌లో దేశానికే టెక్నాలజీలో మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్‌లు వివిధ దేశాల్లో పర్యటించి పెట్టుబడిదారులకు నమ్మకం కల్పిస్తున్నారని, స్థిరమైన విధానాలు, వేగవంతమైన అనుమతులు, మానవ వనరులు అందుబాటులో ఉండడంతో రాష్ట్రానికి టెక్ దిగ్గజాలు వస్తున్నాయన్నారు. పెట్టుబడిదారులను అడ్డుకొనేందుకు దుష్టశక్తులు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించవన్నారు. సమావేశంలో నాయకులు ధూళి రంగనాయకులు, పీలా తులసీ రామ్, కెవిజయరామరాజు, ఎన్. నర్సింగరావు పాల్గొన్నారు.

కొరుప్రోలు సొసైటీలో రైతు అభినందన సభ



రైతును సన్మానించి జ్ఞాపికను అందజేస్తున్న వైస్ ఎంపీపీ గోవిందరావు, టీడీపీ నాయకులు

ఎస్.రాయవరం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కొరుప్రోలు సొసైటీలో సోమవారం రైతు అభినందన సభ నిర్వహించారు. సొసైటీలో రుణాలు తీసుకొని సకాలంలో చెల్లించిన రైతులను చైర్‌పర్సన్ రామకృష్ణ, వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు, టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి అల్లు నరసింహమూర్తి, బ్యాంకు సెక్రటరీ వై ప్రసాద్ పాల్గొన్నారు.

ధర్మవరం అగ్రహారానికి ఎక్స్‌ప్రెస్ బస్సు హాల్ట్ ఇవ్వాలి



సీఎం పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందజేస్తున్న సోమిరెడ్డి రాజు

ఎస్.రాయవరం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం అగ్రహారం గ్రామం వద్ద ఎక్స్‌ప్రెస్ బస్సు హాల్ట్ ఇవ్వాలని ఎస్.రాయవరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు సోమిరెడ్డి రాజు సోమవారం మంగళగిరి ముఖ్యమంత్రి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. అలాగే కర్రివానిపాలెం నుంచి పాకయరావుపేట, నర్సీపట్నంలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. మహాకవి గురజాడ జన్మస్థలమైన ఎస్.రాయవరం గ్రామానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పందించి కర్రివానిపాలెం గ్రామం నుంచి పాయకరావుపేట, నర్సీపట్నం గ్రామాలకు బస్సులను వేయాలని, ధర్మవరం అగ్రహారం వద్ద ఎక్స్‌ప్రెస్ బస్సు హాల్ట్ ఇవ్వాలని కోరారు.

దెబ్బతిన్న వరి పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు



వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఏవో

కె.కోటపాడు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరెడ్డిపాలెంలో తెగులు సోకిన వరి పంటను సోమవారం అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. గ్రామానికి చెందిన ఈర్లే దేముడుకు చెందిన 40 సెంట్లు భూమిలో పెన్నాసోనా అనే కొత్త వరి రకం వేశారు. చుట్టుపక్కల అన్ని పొలాలు బాగున్నా.. ఈ పెన్నా సోనా అనే రకం పూర్తిగా తెగులు సోకి పాడైంది. ఈ విషయమై వివిధ దినపత్రికల్లో రావడంతో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ భవాని, డాక్టర్ చంద్రశేఖర్, స్థానిక వ్యవసాయాధికారి సోమశేఖర్ సూరెడ్డిపాలెం పంట పొలాలను సోమవారం పరిశీలించారు. పెన్నా సోనా వరి రకం ఈ ప్రాంతానికి అనువు కాదని, భవిష్యత్తులో ఈ రకం ఈ ప్రాంతంలో వేయొద్దని సూచించారు. నీరు బయటకు వెళ్లే మార్గం లేక పోషకాలు వరి పంటకు అందడం లేదన్నారు. పంటకు ఎక్కువగా సుడిదోమ పట్టిందన్నారు. సుడిదోమ నివారణకు ట్రైఫూమిజోఫైరం అనే మందును స్ప్రే చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వీఏఏ జనార్దన్, రైతులు నాయనప్ప, జామి సూర్యనారాయణ, సూరెడ్డి నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలు ధరించి వైద్య సిబ్బంది నిరసన



పీహెచ్‌సీ ఎదుట నల్లబాడ్జీలు ధరించి నినాదాలు చేస్తున్న వైద్య సిబ్బంది

కశింకోట, అక్టోబర్ 13 (ఆంధ్రజ్యోతి) : డిమాండ్ల పరిష్కారానికి ఇక్కడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సిబ్బంది సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యునైటెడ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి సీహెచ్.సత్యనారాయణ మాట్లాడుతూ గతంలో మాదిరిగా 23శాతం ఇన్ సర్వీస్ కోటా కల్పించాలని, ప్రమోషన్ పాలసీని వేగవం తం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. వైద్యులు చేస్తున్న సమ్మెకు పరిష్కారం కనుగొనాలన్నారు. వైద్యుల ఆందోళనకు సిబ్బంది సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో యు.వి.ఎస్.ఎన్.ఫణిభూషణ్, టి.మురళీకృష్ణ, కె.శివాజీ, ఆర్.విజయలక్ష్మి పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో అర్జీల స్వీకరణ



సమస్యలపై అర్జీని స్వీకరిస్తున్న తహశీల్దార్ నాగరాజు

పరవాడ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పదమూడు మంది విచ్చేసి తమ సమస్యలపై అర్జీలను అందజేశారు. ప్రతి ఒక్కరితో తహశీల్దార్ నాగరాజుకు మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. భూముల రీ సర్వేలో తప్పులను సవరించాలని, పట్టాదారు పాసు పుస్తకాలు అందజేయాలని, ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన సీసీ రోడ్డుకు బిల్లు చెల్లింపులు జరపాలని పలువురు విన్నవించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మురళీధరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దేశపాత్రునిపాలెంలో కార్పొరేటర్ శ్రీనివాస్ పర్యటన

లంకెలపాలెం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 79వ వార్డు దేశపాత్రునిపాలెంలో చేపడుతున్న సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులను కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. ఈ సందరంగా మాట్లాడుతూ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలన్నారు. అనంతరం ఆయన గ్రామంలో పర్యటించి డ్రైనేజీలను పరిశీలించారు. ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని అక్కడి ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పిల్లా శివకుమార్, మచ్చా శివకుమార్, అమరపిన్ని శ్రీనివాసరావు, చిన్నారావు, వర్కు ఇన్‌స్పెక్టర్ సురేశ్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వాడచీపురుపల్లి హైస్కూల్‌కు షామియానాల వితరణ



షామియానాలు అందజేస్తున్న మాజీ ఎంపీపీ తదితరులు

పరవాడ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : వాడచీపురుపల్లి హైస్కూల్‌కు నాయుడుపాలెం గ్రామానికి చెందిన స్టీల్‌ప్లాంట్ రిటైర్డు ఉద్యోగి కూండ్రపు నరసింహమూర్తి రూ.23 వేలు విలువ చేసే షామియానాలను సమకూర్చారు. వీటిని సోమవారం మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు చేతుల మీదుగా ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బూస అప్పలరాజు, మాజీ ఎంపీటీసీ కూండ్రపు సీతారామయ్య, శ్రీరామ్మూర్తి, స్థానిక నాయకులు కూండ్రపు అప్పలనాయుడు, గెడ్డం నరసింగరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

'రాజయ్యపేటలో బల్క్‌డ్రగ్ పార్కును రద్దు చేయాలి'

అనకాపల్లి టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : నక్కపల్లి మండలం రాజయ్యపేటలో నిర్మించ తలపెట్టిన బల్క్‌డ్రగ్ పార్కును వెంటనే రద్దు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఇక్కడి దొడ్డి రామునాయుడు భవనంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. బల్క్‌డ్రగ్ పార్కు వద్దంటూ నెల రోజులుగా శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్నారన్నారు. పోరాటాన్ని అణచివేయాలని ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. తక్షణమే బల్క్‌డ్రగ్ పార్కును రద్దు చేయాలని లేకుంటే జిల్లా వ్యాప్తంగా 15వ తేదీ నుంచి రైతు సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు గండి నాయనబాబు, కె.తేలయ్యబాబు, నాగిరెడ్డి సత్యనారాయణ, కె. సోమునాయుడు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీని ప్రభుత్వమే నిర్మించాలని ధర్నా



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మాకవరపాలెం మండలంలో మెడికల్ కాలేజీని ప్రభుత్వమే నిర్మించి ప్రజలకు వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు సోమవారం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ మెడికల్ కళాశాల నిర్మాణం ప్రారంభమైన తర్వాత అర్ధంతరంగా నిలిచిపోయిందన్నారు. దీనివల్ల ఇప్పటికే వెచ్చించిన సొమ్ము వృథా అవుతుందన్నారు. నిలిచిపోయిన పది మెడికల్ కళాశాలలను పీపీపీ పద్ధతిలో నిర్మిస్తామని ప్రభుత్వం ప్రకటించడం సరైనది కాదన్నారు. ఈ మెడికల్ కళాశాలలు పూర్తయితే యువతకు వైద్య విద్యలో అవకాశాలు పెరిగి, ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. అందువల్ల ప్రభుత్వమే నిర్మాణం చేపట్టాలన్నారు. నాయకులు ఆర్.శంకరరావు, గంటా శ్రీరామ్, గనిశెట్టి సత్యనారాయణ, వీవీ శ్రీనివాసరావు, ఎ.రాజు పాల్గొన్నారు.

'మెడికల్ కాంట్రాక్టు వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి'

అనకాపల్లి టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ కాంట్రాక్టు వర్కర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. సోమవారం ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద ధర్నా నిర్వహించి డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ కృష్ణారావులకు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం శానిటేషన్ కార్మికుల శ్రమను దోచుకుంటుందన్నారు. జీతాలు సరిగా చెల్లించని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వద్దాది అప్పలరాజు, చిందాడ లక్ష్మి, సత్యవతి, కాశీ తదితరులు పాల్గొన్నారు.

సోమవరంలో కెనరా బ్యాంకు బ్రాంచి ప్రారంభం

కశింకోట, అక్టోబర్ 13 (ఆంధ్ర జ్యోతి) : మండలంలో సోమవరం గ్రామంలో నూతనంగా ఏర్పాటుచేసిన కెనరా బ్యాంకు బ్రాంచ్‌ను విజయవాడ సర్కిల్ హెడ్ జనరల్ మేనేజర్ విజయలక్ష్మి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు, స్వయం శక్తి సం ఘాలకు, విద్యార్థులకు అవసరమైన రుణాలు మంజూరు చేస్తామన్నారు. గృహ రుణాలు తదితర ప్రభుత్వ రంగ సేవలు అందిం చేందుకు ఈ బ్యాంకు పనిచేస్తుందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, బ్యాంకు ఏజీఎం మధుసూదనరెడ్డి, కశింకోట బ్రాంచి మేనేజర్ మురళీకృష్ణ, ప్రముఖ వ్యాపారి కోలాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



మార్కెట్ రోడ్డు మధ్యలో నిలిచిన వర్షపు నీరు



పడమర భాగంలో...



మార్కెట్ రోడ్డు మధ్యలో వృథా కూరగాయల పోగు

కూరగాయల కోసం వస్తే.. కొత్త రోగాలు వచ్చేలా..!

▸▸ అత్యంత దారుణంగా మార్కెట్ ▸▸ చినుకు పడితే చిత్తడి ▸▸ కుళ్లిన సరకు ఆవరణలోనే పారబోత ▸▸ భరించలేని దుర్వాసనతో జనం అవస్థలు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణ నడిబొడ్డున ఉన్న కూరగాయల మార్కెట్ చినుకుపడితే చిత్తడిగా మారుతోంది. సరైన శుభ్రత లేకపోవడంతో పాటు పలువురు వ్యాపారులు వృథా కూరగాయలను మార్కెట్ మధ్యలో వేస్తుండడంతో మరింత దారుణంగా తయారవుతోంది. ఫలితంగా కూరగాయల కోసం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మార్కెట్‌కు నిత్యం వేకువజాము మూడు గంటల నుంచి వివిధ మండలాల రైతులు తాము పండించిన కూరగాయలను తీసుకువస్తుంటారు. అలాగే, ఇతర ప్రాంతాలకు చెందిన చిల్లర వర్తకులతో పాటు స్థానిక చిల్లర వర్తకులు కూడా వస్తుంటారు. అయితే రైతులు ఆరు గంటలకే తాము తెచ్చిన కూరగాయలను అమ్మకాలు చేసి వెళ్లిపోతారు. ఆ తర్వాత నుంచి మార్కెట్‌కు పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు కూరగాయల కొనుగోలు వస్తుంటారు. ఆదివారం పారిశుధ్య కార్మికులకు సెలవు కావడం వల్ల ఎక్కడి చెత్త అక్కడే ఉండిపోవడంతో ఆవరణ అంతా దుర్భరంగా మారింది. దీనికి తోడు సోమవారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఎడతెరిపి లేకుండా చినుకులు పడడంతో మరింత దారుణంగా తయారైంది. వర్తకులు కూడా వృథా కూరగాయలను ఒకచోట ఏర్పాటు చేసి జీవీఎంసీ సిబ్బంది వాహనంతో వచ్చినప్పుడు అందులో వేయకుండా తమకు ఎందుకులే అనే ధోరణితో మార్కెట్ ఆవరణలోని రోడ్డుపై వేస్తున్నారు. కుళ్లిన ఈ కూరగాయలు వల్ల దుర్వాసన వెదజల్లుతుండడంతో మార్కెట్ వచ్చేవారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మార్కెట్ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టిసారించాలని అంతా సూచిస్తున్నారు. ఈ సమస్యను శానిటేషన్ విభాగం అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా, కూరగాయల మార్కెట్ పరిశుభ్రతకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



చిత్తడిగా ఉన్న కూరగాయల మార్కెట్

సూపర్ జీఎస్టీపై విస్తృతంగా ప్రచారం





నీలకంఠరావు వీధి, రామునాయుడు కాలనీలో నాగజగదీశ్వరరావు, సురేంద్ర కరపత్రాల పంపిణీ

అనకాపల్లి టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్‌పై సోమవారం టీడీపీ నాయకులు పట్టణంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. 81వ వార్డు నీలకంఠరావు వీధిలో చినుకులు పడుతున్నా మాజీ ఎమ్మెల్సీ టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగ జగదీశ్వరరావు ఇంటింటికీ వెళ్లి జీఎస్టీ సంస్కరణల ఫలితాలను వివరించారు. పన్నులు గతంలో కంటే బాగా తగ్గడం వల్ల ప్రతి కుటుంబానికి ప్రయోజనం కలుగుతుందని నాగజగదీశ్వరరావు అన్నారు. పార్టీ నాయకులు కాండ్రేగుల సత్యనారాయణ, మళ్ల గణేష్, పీలా రమణారావు, వియ్యపు రాజు, మళ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఇదే వార్డు రామునాయుడు కాలనీలో గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర ఇంటింటికీ వెళ్లి సూపర్ జీఎస్టీ వల్ల కలిగే లాభాలను వివరించి, కరపత్రాలను అందజేశారు. బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వేదుల సూర్యప్రభ, జామిరాజు, మారిశెట్టి శంకర్రావు, పొలిమేర ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, మిరియాల కాలనీలో జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి పర్యటించి జీఎస్టీ సంస్కరణల వల్ల లాభాలను వివరించారు. ధరలు తగ్గడం వల్ల ప్రజలలో కొనుగోలు శక్తి పెరుగుతుందన్నారు. ఎక్కడైనా పాత ధరలకే వస్తువుల విక్రయాలు జరిగితే వెంటనే ఫిర్యాదు చేయాలని జడ్సీ సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పోలారపు త్రినాథ్, మంగా ఈశ్వరరావు, ఎస్.భానుచందర్, పిట్ల రాజుతో పాటు యూపీహెచ్‌సీ వైద్యురాలు కె.ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

కుంచంగికి చెందిన

సీఆర్‌పీఎఫ్ ఉద్యోగి మృతి

▸▸ బిహార్‌లో విధులు నిర్వహిస్తుండగా గుండెపోటు

▸▸ గతంలో జరిగిన ఎదురు కాల్పుల్లో ఇతని సోదరుడు వీరమరణం

▸▸ నేడు స్వగ్రామానికి శ్రీనివాసరావు మృతదేహం



శ్రీనివాసరావు (ఫైల్)

కొత్తూరు, అక్టోబర్ 13 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం కుంచంగి గ్రామానికి చెందిన సీఆర్‌పీఎఫ్ ఉద్యోగి చిన్ని శ్రీనివాసరావు (51) బిహార్‌లో విధులు నిర్వహిస్తూ సోమవారం గుండెపోటుతో మృతిచెందినట్టు అధికారులు ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గతంలో ఇతని సోదరుడు రామేశ్వరరావు సీఆర్‌పీఎఫ్‌లోనే విధులు నిర్వహించేవారు. ఎదురు కాల్పుల్లో వీరమరణం పొందడంతో అతని ఉద్యోగాన్ని శ్రీనివాసరావుకు ఇచ్చారు. ఇప్పుడు ఈయన కూడా మరణించడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఇతనికి భార్య, కుమార్తె ఉన్నారు. ఈ ఘటనపై గ్రామానికి చెందిన మాజీ సైనికుల సంఘం నాయకుడు పోలిన సూరిజగ్గారావు సం తాపం ప్రకటించారు. కాగా, శ్రీనివాసరావు మృతదేహాన్ని విమానంలో మంగళవారం స్వగ్రామమైన కుం చంగికి తీసుకు రానున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహిస్తామన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలి

▸▸ డీఎం హెచ్‌వో డాక్టర్ హైమావతి



బాలికలను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఎం హెచ్‌వో డాక్టర్ హైమావతి

అనకాపల్లి టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : బాలికలు అన్నిరంగాల్లో ముందుండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.హైమావతి అన్నారు. అంతర్జాతీయ బాలిక సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా జీవీఎంసీ పట్టణ బాలికోన్నత పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. బాలుర నిష్పత్తికి సమానంగా బాలికలు ఉండేలా చూడాలన్నారు. బాలికలకు తమ హక్కుల పట్ల అవగాహన కల్పించేందుకు, లింగ వివక్షత రూపుమాపడానికి ఇటువంటి వేడుకలు దోహదపడతాయన్నారు. జిల్లా లెప్రసీ అండ్ టీబీ అధికారిణి డాక్టర్ స్వప్న మాట్లాడుతూ బాలికల్లో పోషకాహార లోపం లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ కె.చంద్రశేఖర్‌దేవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయిని రుధిరరాణి తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపాలెం గురుకుల విద్యాలయంలో...

కశింకోట : బాలికల సంరక్షణపై తాళ్లపాలెం అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో సోమవారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వైద్యాధికారి డాక్టర్ ఎ.మోహన్‌కిశోర్ మాట్లాడుతూ ఆడ పిల్లలను బాగా చదివించి ఉన్నత స్థానాల్లో నిలిచేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. పద్దెనిమిదేళ్లు నిండిన తరువాతే వివాహాలు చేయాలన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అంతా అవగాహన కలిగి ఉండాలన్నారు. లింగ నిర్ధారణ చట్టప్రకారం నేర మని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య బోధకుడు ఎం.ఎస్.వి. ప్రసాద్, గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ జె.మెర్సీ వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పది మద్యం సీసాలు స్వాధీనం

కశింకోట, అక్టోబర్ 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పరవాడపాలెం గ్రామ కూడలి మీదుగా పది మద్యం క్వార్టర్ బాటిళ్లు తరలిస్తున్న బొండా మంగ అనే మహిళను పట్టుకున్నట్టు హెడ్ కానిస్టేబుల్ సూర్యారావు తెలిపారు. సీఐ స్వామినాయుడుకు అందిన ముందస్తు సమాచారం మేరకు సోమవారం తనిఖీలు నిర్వహించామన్నారు. ఆ సమయంలో సదరు మహిళ మద్యం బాటిళ్లు పట్టుకున్న వస్తుండగా గుర్తించి అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు.

గంబూషియా చేపలతో దోమల లార్వా నివారణ : డీఆర్‌వో



గంబూషియా చేపలను నీటికొలనులో వేస్తున్న డీఆర్‌వో సత్యనారాయణరావు

అనకాపల్లి కలెక్టరేట్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : దోమల లార్వాను తినే గంబూషియా చేపలతో మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులను అరికట్టవచ్చని జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు అన్నారు. కలెక్టరేట్ ప్రాంగణంలోని నీటి కొలనులో సోమవారం సాయంత్రం గంబూషియా చేపలను వదిలారు. జిల్లాలో ఎంపిక చేసిన 295 నీటి నిల్వ కేంద్రాలు చెరువులు, కొలనులు, నూతులలో లక్షా 30వేల గంబూషియా చేపలను విడుదల చేస్తున్నట్టు తెలిపారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నిర్మూలనలో యాంటీ లార్వా ఆపరేషన్ కీలకమని, గంబూషియా చేపలు ఈ ప్రక్రియలో ప్రధాన పాత్ర పోషిస్తాయని చెప్పారు. ఇవి నీటిలో మూడు నుంచి నాలుగు సంవత్సరాల వరకు జీవించి, దోమల లార్వాలను పూర్తిగా తినేస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సందీప్, ముఖ్య ప్రణాళికాధికారి రామారావు, జిల్లా మలేరియా అధికారి వరహాల దొర, సహాయ మలేరియా అధికారి తదితరులు పాల్గొన్నారు.

బయ్యవరం కోనేరులో...

కశింకోట: బయ్యవరంలోని ధర్మకోనేరులో కశింకోట పీహెచ్‌సీ సిబ్బంది సోమవారం గంబూసియా చేపలను విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్.కె.రెహమన్ (బాబర్) గ్రామస్థులకు అవ గాహన కల్పించారు. గంబూసియా చేపలు చెరువుల్లో వేయడం వల్ల దోమలు వృద్ధి చెందకుండా ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. తద్వారా దోమలను నియంత్రించ వచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సీహెచ్.గీత సత్యప్రసాద్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐటీఐల్లో ఐదో విడత ప్రవేశాలకు నోటిఫికేషన్

విశాఖపట్నం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ ప్రభుత్వ/ప్రైవేటు ఐటీఐల్లో మిగులు సీట్లను భర్తీ చేసేందుకు వీలుగా ఐదో విడత కౌన్సెలింగ్ నిర్వహించేందుకు పారిశ్రామిక శిక్షణ సంస్థ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు జిల్లా ఐటీఐల ప్రవేశాల కన్వీనర్, కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ వివరాలను వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులను ఈనెల 16వ తేదీలోగా ఆన్‌లైన్‌లో సమర్పించాలని సూచించారు. అభ్యర్థి ఎక్కడ చేరదలచుకుంటే ఆ ఐటీఐకు మాత్రమే దరఖాస్తు చేయాలని స్పష్టం చేశారు. సమీపంలోని ప్రభుత్వ ఐటీఐకు హాజరై ధ్రువపత్రాలు పరిశీలించుకుని, రశీదు పొందాలన్నారు. ఈ నెల 17న దరఖాస్తులో పేర్కొన్న ఐటీఐలో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. అభ్యర్థులకు మెసేజ్‌లు పంపే అవకాశం లేదని అంతా ఈ విషయాన్ని గుర్తించాలని ఆయన స్పష్టం చేశారు.

వైసీపీ కోటి సంతకాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైసీపీ నాయకులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ తలపెట్టిన కోటి సంతకాల సేకరణ పోస్టర్‌ను పట్టణంలోని రింగు రోడ్డులో గల వైసీపీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోటి సంతకాల సేకరణను అంతా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కొప్పాక వద్ద గల ఎక్సైజ్ కార్యాలయానికి వెళ్లి నకిలీ మద్యం ఘటనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఐ నాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు బొడ్డేడ ప్రసాద్, శోభా హైమావతి, మలసాల భరత్ కుమార్, దంతులూరి దిలీప్‌కుమార్, గొర్లి సూరిబాబు, మళ్ల బుల్లిబాబు, మహిళా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

15న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

సబ్బవరం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను ఈ నెల 15వ తేదీన సబ్బవరంలో నిర్వహించనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణ సోమవారం విలేకరులకు తెలిపారు. సబ్బవరంలోని డి-1 సెక్షన్ కార్యాలయంలో మధ్యాహ్నం 1.30 గంటలకు ప్రారంభం కానుందన్నారు. రిటైర్డ్ జడ్జి డాక్టర్ బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు బి.సులేఖరాణి, సభ్యులు ఎస్. మురళీకృష్ణ, సుబ్బారావు హాజరు కానున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వినియోగదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని విద్యుత్ పరంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

▸▸ నిబంధనలు పాటించని డ్రైవర్లకు జరిమానా



వాహనాన్ని తనిఖీ చేస్తున్న సీఐ మల్లికార్జునరావు, తదితరులు

పరవాడ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఊటగెడ్డ జంక్షన్ నుంచి సింహాద్రి ఎన్టీపీసీకి వెళ్లే ప్రధాన రహదారిలో సోమవారం రాత్రి పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ గోపాలకృష్ణ తమ సిబ్బందితో కలిసి ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఎన్టీపీసీ, పరిసర పరిశ్రమలకు చెందిన కార్మికులను అనధికారికంగా గూడ్స్ వెహికల్స్‌లో తీసుకువెళ్తున్నట్టు గుర్తించారు. మూడు వాహనాలను స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. సంబంధిత డ్రైవర్లకు రూ.18 వేల అపరాధ రుసుం విధించారు. గూడ్స్ వెహికల్స్‌లో కార్మికులను తరలించడం చట్టరీత్యా నేరమన్నారు. యాజమాన్యాలు, కాంట్రాక్టర్లు కార్మికులను పాసింజర్ ఆటోలు, మ్యాక్సీ క్యాబ్‌లలో మాత్రమే తరలించాలని సూచించారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి తనిఖీలు చేపడతామని వారు స్పష్టం చేశారు.

నూతన ఉపాధ్యాయులు చేరిక


అరకులోయ : ఎంఈవో త్రినాథ్‌రావు నుంచి నియామక పత్రాలు స్వీకరిస్తున్న నూతన ఉద్యోగులు


డుంబ్రిగుడ: నూతన ఉపాధ్యాయులకు నియామక పత్రాలను అందిస్తున్న ఎంఈవో సుందరరావు


పెదబయలు: నూతన ఉపాధ్యాయులకు ఆర్డర్ కాపీలను అందిస్తున్న ఎంఈవోలు కొమ్ము కృష్ణమూర్తి, గుమ్మ పుష్పజోసెఫ్

- అంకిత భావంతో విద్యాభివృద్ధికి కృషి చేయాలని మండల విద్యాశాఖ అధికారుల సూచన
- పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీరిందంటున్న పలువురు ప్రధాన ఉపాధ్యాయులు

పెదబయలు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీ ద్వారా మండలానికి 42 మంది నూన ఉపాధ్యాయులు వచ్చారని మండల విద్యాశాఖ అధికారులు కొమ్ము కృష్ణమూర్తి, గుమ్మ పుష్పజోసెఫ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిషత్, గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల్లో ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్‌లు, ఎల్‌ఎఫ్‌ఎల్ హెడ్ మాస్టార్లు జాయిన్ అయ్యారని తెలిపారు. దీంతో స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో నూతన ఉపాధ్యాయుల సందడి నెలకొంది. నూతన ఉపాధ్యాయులకు మండల విద్యాశాఖ అధికారులు, సీఆర్‌పీలు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు స్వాగతం పలికారు. అనంతరం వారికి ఆర్డర్ కాపీలను ఇచ్చారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి

డుంబ్రిగుడ, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీతో మండలంలోని 40 మంది నూతన ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి ఆధ్వర్యంలో నిర్వహించిన కౌన్సెలింగ్ ద్వారా ఎంపికై సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈవో సుందరరావు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలరాజు, మండల కార్యదర్శి శ్రీనివాస్ ఉపాధ్యాయులను అభినందించారు.

కొయ్యూరు మండలంలో

కొయ్యూరు, (ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీలో ఎంపికైన 24 మంది నూతన ఉపాధ్యాయులను మండలానికి కేటాయించామని మండల విద్యాశాఖాధికారి రాంబాబు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే పాఠశాలలకు 12 మందిని, మిగిలిన వారిని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు కేటాయించారని తెలిపారు. ఈ సందర్భంగా నూతన ఉపాధ్యాయులు సోమవారం వారికి కేటాయించిన పాఠశాలల్లో విధులకు హాజరైయారని తెలిపారు. అయితే గిరిజన సంక్షేమ శాఖకు సంబంధించిన పాఠశాలల్లో ఖాళీలను పూర్తిగా భర్తీ కాగా ప్రభుత్వ పాఠశాలల్లో 36 పోస్టులు ఖాళీ ఉండగా అందులో 12 భర్తీ అయ్యాయని మిగిలిన 24 పోస్టులు భర్తీ చేసేందుకు నివేదించామని తెలిపారు.

మండలంలో 62 ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ

చింతపల్లి, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీ ద్వారా మండలానికి 62 మంది నూతన ఉపాధ్యాయులు నియమితులయ్యారని ఎంఈవో పీబీవీవీ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో కొత్తగా నియమితులైన ఉపాధ్యాయులు సోమవారం కార్యాయలంలో రిపోర్టు చేశారని తెలిపారు. మండల పరిషత్, ప్రభుత్వ, గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ, ప్రాథమిక పాఠశాలలకు 62 మంది ఉపాధ్యాయులను నియమించామని తెలిపారు. దీంతో మండలంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ అయ్యాయని తెలిపారు. నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేయాలని, నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులను స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 గెమ్మెలి బోడం నాయుడు పాల్గొన్నారు.

అరకులోయ మండలంలో

అరకులోయ, (ఆంధ్రజ్యోతి): ఇటీవల కూటమి ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీతో మండలంలో ఉన్న ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 30 మంది ఉపాధ్యాయులు నియమితులయ్యారు. వీరు సోమవారం విధుల్లో చేరారు. ఇంకా మూడు పోస్టులు ఖాళీ ఉన్నాయి. ఈ నెల రోజుల్లో అవి కూడా భర్తీ అయ్యే అవకాశం ఉన్నది. అదే విధంగా మండల విద్యాశాఖ పరిధిలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు, ప్రభుత్వ ప్రథమిక పాఠశాలలకు సంబంధించి 21 పోస్టులు ఖాళీ ఉండగా 7 విధుల్లో చేరారు. మిగిలిన 14 పోస్టులను నెలరోజుల్లో భర్తీ చేసే అవకాశముందని ఎంఈవో వి.త్రినాథరావు తెలిపారు.

అంకితభావంతో విధులు నిర్వహించాలి

ముంచంగిపుట్టు, (ఆంధ్రజ్యోతి): నూతన ఉపాధ్యాయులు అంకిత భావంతో విధులను నిర్వహించాలని ఎంఈవో కె.కృష్ణమూర్తి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన మెగా డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన 46 మంది నూతన ఉపాధ్యాయులకు సోమవారం ఎంఈవో కృష్ణమూర్తి నియామక పత్రాలను అందజేశారు. నూతన ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి తమవంతు కృషి చేయాలని సూచించారు.

ఉన్నత పాఠశాలలో 8 మంది ఉపాధ్యాయుల నియామకం

సీలేరు, , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 8 మంది ఉపాధ్యాయులను విద్యాశాఖాధికార్లు నియమించడంతో వారు సోమవారం విధుల్లో చేరారని పాఠశాల హెచ్‌ఎం నాగభూషణం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8మంది నూతన ఉపాధ్యాయులు రావడంతో పాఠశాలకు ఉపాధ్యాయుల కొరత తీరిందన్నారు.

మద్యం సేవించి వాహనం నడిపితే చర్యలు

- ఎస్‌ఐ ఎం.వెంకటరమణ


వాహనాల పత్రాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ ఎం.వెంకటరమణ

చింతపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ ఎం. వెంకటరమణ హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలో ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా వాహన తనిఖీలు నిర్వహించి, డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలన్నారు. సర్వీసు వాహనాలు, ద్విచక్రవాహనాలకు సంబంధించిన సీబుక్, ఇన్సూరెన్సు, పొల్యూషన్ పత్రాలు ఎప్పుడూ వెంటే ఉండాలన్నారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ఈ ప్రాంతంలో అధిక సంఖ్యలో ద్విచక్రవాహనాల ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు.

నకిలీ మద్యాన్ని అరికట్టాలని వినతి



ఎక్సైజ్ సీఐ ఆచారికి వినతిపత్రం అందిస్తున్న పార్వతమ్మ

పాడేరురూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నకిలీ మద్యాన్ని అరికట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలని వైసీపీ జిల్లా అధ్యక్షురాలు కురసా పార్వతమ్మ సోమవారం ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఆచారికి సోమవారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ప్రాణాలను తీయడమే లక్ష్యంగా, అక్రమ సంపాదన కోసం కూటమి ప్రభుత్వం ఎక్కడపడితే అక్కడ నకిలీ మద్యం దుకాణాలను ఏర్పాటు చేస్తోందని ఆరోపించారు. కల్తీ మద్యం తయారీపై సీబీఐ దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని, నకిలీ మద్యం దుకాణాలను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జీకేవీధి జడ్పీటీసీ సభ్యురాలు కిముడు శివరత్నం, మండల పార్టీ అధ్యక్షుడు సీదరి రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్న దొర వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

16న మండల సర్వసభ్య సమావేశం

ముంచంగిపుట్టు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): వచ్చే గురువారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కెధర్మారావు తెలపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీపీ ఎ. సీతమ్మ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని అన్నారు. ఈ కార్యక్రమం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని చెప్పారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు హాజరు కావాలని సూచించారు.

శ్రమదానంతో తుప్పల తొలగింపు


తుప్పల తొలగింపు కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్థులు

జి.మాడుగుల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుదలవీధి నుంచి తాడివీధి వరకు రహదారికి ఇరువైపులా తుప్పలు ఏపుగా పెరిగిపోవడంతో అనర్భ క్లస్టర్ పెసా ఉపాధ్యక్షుడు బి.లక్ష్మయ్య ఆధ్వర్యంలో గ్రామంలోని యువకులు సోమవారం తుప్పలను తొలగించారు. అయితే ఇటీవల పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు అందినప్పటికీ శ్రమదానం పనులు చేయాల్సి వస్తోందని వారు ఆరోపించారు.

ఇతర రాష్ట్రాల వారితో జాగ్రత్త

- డీఎస్‌పీ షేక్ షెహబాబ్

అరకులోయ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పర్యాటకులు, చిన్న చిన్న వ్యాపారాల ముసుగులో స్థానికంగా తిష్ఠ వేసి కొందరు అంతర్‌రాష్ట్ర వ్యక్తులు గంజాయి రవాణాలకు పాల్పడుతున్నట్టు గుర్తించామని పాడేరు డీఎస్‌పీ షెక్ షెహబాబ్ అహ్మద్ తెలిపారు. సోమవారం రాత్రి అరకులోయ పోలీస్‌స్టేషన్‌లో సీఐ హిమగిరి, ఎస్‌ఐ గోపాలరావు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలకు చెందిన వారు అరకులోయ, జి.మాడుగల వంటి పర్యాటక ప్రాంతాల్లో చిరు వర్తకుల ముసుగులో గంజాయి రవాణ చేస్తున్నట్టు గుర్తించామని తెలిపారు. కొత్త వ్యక్తులకు, అందులోను ఇతర రాష్ట్రల వారికి ఇళ్లను అద్దెకు ఇచ్చే సమయంలో జాగ్రత్తగా ఉండాలని స్థానికులకు డీఎస్‌పీ సూచించారు.

ఆవిష్కరణల వల్ల సృజనాత్మకత మెరుగు

- ఏయూ ఆచార్యుడు డాక్టర్ కె.కనకకుమార్ చాంద్

చింతపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నేటి యువత పరివర్తన ఆవిష్కరణలపై చైతన్యవంతులు కావాలని ఆంధ్రవిశ్వవిద్యాలయం ఆచార్యుడు డాక్టర్ కె.కనక కుమార్‌చాంద్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయరాణి అధ్యక్షతన పరివర్తన ఆవిష్కరణపై రెండోవ జాతీయ సెమినార్ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత నూతన ఆవిష్కరణలపై సృజనాత్మకంగా ముందుకు సాగాలని సూచించారు. టెక్నాలజీ, సైన్సులో విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలన్నారు. నూతన ఆవిష్కరణల ద్వారా యువతలో సృజనాత్మకత పెరుగుతుందని అన్నారు. ఉన్నత స్థానాలను పెట్టుకుని ఆ దిశగా ముందుకు సాగాలని సూచించారు.

గౌరీపరమేశ్వరుల ఉత్సవ రాట


ఉత్సవరాట ప్రతిష్ఠిస్తున్న సంఘం ప్రతినిధులు

పాడేరురూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే గౌరీ పరమేశ్వరుల ఉత్సవాన్ని ఈ ఏడాది నిర్వహించేందుకు ఆలయం వద్ద ఉత్సవ రాటను సోమవారం ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ ఈనెల 18న గౌరీ పరమేశ్వరుల విగ్రహ ప్రతిష్ఠ చేస్తామన్నారు. నవంబరు 15 వరకు ఈ ఉత్సవాలను జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

- వ్యవసాయ అధికారి గిరిబాబు


ఈ-క్రాప్ నమోదు చేస్తున్న ఏవో గిరిబాబు

గూడెంకొత్తవీధి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రైతులందరూ ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని స్థానిక వ్యవసాయ అధికారి డి. గిరిబాబు అన్నారు. మండలంలోని అద్దరవీధి గ్రామంలో వ్యవసాయ అధికారి ఈ-క్రాప్ నమోదు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని మొత్తం 12,412.5 ఎకరాల్లో గిరిజన రైతులు పంటలను సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 9,519 ఎకరాల సాగు చేస్తున్న పంటలను రైతులు ఈ-క్రాఫ్ నమోదు చేయించుకున్నారని ఇంకా 5,600 సంబంధించి చేయించుకోవాల్సి ఉందన్నారు. ఈ-క్రాప్ నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే పంటలకు సంబంధించిన ప్రభుత్వ పథకాలు, రాయితీలు వర్తిస్తాయని వెల్లడించారు. ఈ మేరకు ఈనెల 25 లోపు రైతులు ఈ-క్రాఫ్ నమోదు తప్పని సరిగా చేయించుకోవాలన్నారు.

'గ్రామంలో సమస్యలు పరిష్కరించాలి'

ముంచంగిపుట్టు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలో పెదగూడ పంచాయతీ జగ్గంపుట్టు గ్రామంలో నిర్వహించిన కర్మయోగి కార్యక్రమంలో గ్రామ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా తాగునీటి సమస్య పరిష్కరించాలని, డ్రైనేజీలు, సీసీ రోడ్లులు, అభివృద్ధి చేయాలని అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో పలువురు గ్రాముస్థులు పాల్గొన్నారు

మినీ అంగన్‌వాడీ వర్కర్లకు పదోన్నతులు కల్పించండి :సీఐటీయూ


నిరసన వ్యక్తం చేస్తున్న మినీ అంగన్‌వాడీ వర్కర్లు

పాడేరురూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న మినీ అంగన్‌వాడీ వర్కర్లను, కార్యకర్తలుగా పదోన్నతులు కల్పించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మినీ అంగన్‌వాడీలు శిశుసంక్షేమ శాఖ పీడీ, జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాలను అందించారు. సోమవారం కలెక్టర్ కార్యాయలం వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం నిబంధనల మేరకు అర్హతలు ఉన్న మినీ అంగన్‌వాడీ వర్కర్లు పాడేరు ఐటీడీఏ పరిధిలో 150 మంది, రంపచోడవరంలో 79 ఉన్నప్పటికీ వారికి పదోన్నతి కల్పించి మెయిన్ అంగన్‌వాడీ కార్యకర్తగా నియామకాలు చేపట్టకపోవడం బాధాకర విషయమన్నారు. తక్షణమే వారికి ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీకార్యకర్తలకు వేతనాలు పెంచాలని, 5జి మొబైల్స్ సరఫరా చేయాలని, వేతనంతో కూడిన మెడికల్ సెలవులు ఇవ్వాలని, గ్రామాల్లో ఉంటున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రభుత్వ పథకాలను వర్తింపచేయాలని, అంగన్‌వాడీ భవనాలకు మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.భాగ్యలక్ష్మి, యూనియన్ నేతలు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో శుభ్రత లోపిస్తే చర్యలు

- డీడీ పరిమళ


వసతిగృహాన్ని తనిఖీ చేస్తున్న అధికారి

పెదబయలు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పాఠశాల వసతి గృహాలలో శుభ్రత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని డీడీ పరిమళ హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల-1, గురుకుల పాఠశాలలో సోమవారం విస్తృత తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా రెండు పాఠశాలల్లోని రిక్డులను పరిశీలించారు. అనంతరం వసతి గృహాలను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. వసతి గృహాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గర్ల్-1 పాఠశాలలో విద్యార్థుల తరగతికి వెళ్లి సామర్థ్యాలను తెలుసుకున్నారు. విద్యార్థుల మరుగదొడ్లు పరిశుభ్రంగా లేకపోవడంతో హెచ్‌ఎం, వార్డెన్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇద్దరికి సోకాజ్‌లు జారీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏటీడబ్ల్యువో కె.స్వర్ణలత తదితరలు పాల్గొన్నారు.

స్థలం ఆక్రమణపై తహశీల్దార్‌కు ఫిర్యాదు

చింతపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గిరిజన భవనం స్థలాన్ని ఆక్రమణదారుల నుంచి కాపాడాలని గిరిజన ఉద్యోగుల సంఘం మండలాధ్యక్షుడు బౌడు గంగరాజు తహశీల్దార్‌కు సోమవారం ఫిర్యాదు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ఉద్యోగుల భవనం కోసం 11.3సెంట్ల స్థలం ప్రభుత్వం కేటాయించిందని అన్నారు. ప్రస్తుతం ఆర్‌అండ్‌బీ రహదారికి ఆనకుని ఉన్న ఈ స్థలంలో కొందరు ఆక్రమణదారులు నిర్మాణాలు చేపట్టారని అన్నారు. ఈ స్థలానికి సంబంధించి పత్రాలు తమ వద్ద ఉన్నాయని తక్షణమే ఆ నిర్మాణాలను తొలగించాలని తహశీల్దార్‌ను కోరారు. స్పందించిన తహశీల్దార్ సర్వే నిర్వహించి నిర్మాణాలను నిలిపివేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను ప్రచారం చేయండి

- కలెక్టర్ ఏఎస్.దినేశ్ కుమార్


కలెక్టర్ దినేశ్ కుమార్

పాడేరు రూరల్ అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి):దేశవ్యాప్తంగా వస్తు సేవల పన్ను అమలులో భాగంగా పర్యాటక, నిర్మాణ రంగాలకు సంబంధించిన తగ్గింపు ప్రయోజనాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్ అన్నారు. జీఎస్టీపై అవగాహన అవసరమని సంబంధిత అధికారులతో సోమవారం టెలీకాన్ఫెరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటక సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని కొత్త రేట్ల వల్ల కలిగే ఆర్థిక లాభాలపై దృష్టి సారించాలని ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. జీఎస్టీ తగ్గింపుతో పర్యాటక ప్రాంతంలో హోటల్ రూమ్‌ల అద్దెలు తగ్గుముఖం పట్టాయన్నారు. రూ.7వేలు నుంచి రూ.7,500 అద్దె ఉన్న హోటల్ రూమ్‌లపై వర్తించే మొత్తం జీఎస్టీలో దాదాపు 10 శాతం వరకు తగ్గింపు లభిస్తుందని తెలిపారు. ఈ ప్రయోజనాలను పర్యాటకులు, ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ అనే నినాదంతో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు.

'డ్రగ్స్ వద్దు బ్రో' పై విద్యార్థులకు అవగాహన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐ శ్రీనివాసరావు, విద్యార్థులు

కొయ్యూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో చెడు మార్గాలకు వెళ్లకుండా ప్రతి ఒక్కరూ చదువుపైనే దృష్టి సారించాలని సీఐ శ్రీనివాసరావు, ఈగల్ సీఐ నారాయణరావు విద్యార్థులకు సూచించారు. స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల2లో 'డ్రగ్స్ వద్దు బ్రో' అనే కార్యక్రమం ద్వారా విద్యార్థులకు డ్రగ్స్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ యువకులే దేశాభివృద్ధిలో ముఖ్య పాత్ర పోషించాలని, అందుకు డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల జోలికి పోకుండా విద్యపైనే దృష్టి సారించాలని అన్నారు. ఎన్‌డీపీఎస్ చట్టాలు, గంజాయి సంబంధిత కదలికలపై సమాచారం ఇచ్చేందుకు టోల్‌ఫ్రీ నంబరు 1972, డ్రగ్స్ రహిత సమాజం ఏర్పాటుకు ఈగల్ చేపట్టిన కార్యాక్రమాలపై అవగాహన కల్పించి, డ్రగ్స్ దూరంగా ఉంటామని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈగల్ ఐజీపీ రవికృష్ణ, ఎస్పీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈగల్ టీం, మంప ఎస్‌ఐతో పాటు విద్యార్థుల, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ జెన్‌కో కార్మికుల వినతి


సీలేరు కాంప్లెక్సు ఎస్‌ఈ చంద్రశేఖర్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందిస్తున్న కాంట్రాక్టు కార్మిక నాయకులు

సీలేరు, అక్టోబరు 13 , (ఆంధ్రజ్యోతి) : దీర్ఘకాలికంగా నెలకొన్న తమ సమస్యలను పరిష్కరించాలని సీలేరు కాంప్లెక్స్ జెన్‌కో సూరింటెండెట్ ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డికి యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు వినతి పత్రాన్ని సోమవారం అందించారు. 2017లో తెలంగాణ విద్యుత్ సంస్థలు కాంట్రాక్టు కార్మికులను విలీనం చేసుకుని వారి సర్వీసులను క్రమబద్ధీకరించారో, ఆ విధంగా ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖలో పనిచేస్తున్న సుమారు 27151 మంది విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను సంస్థలో విలీనం చేయాలని లేఖలో పేర్కొన్నారు. అలాగే అక్టోబరు 14 లోపు సానుకూల పరిస్థితులు నెలకొనాలని, లేని పక్షంలో 15వ తారీఖు నుంచి సమ్మె చేస్తామని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీలేరు బ్రాంచి సీఐటీయూ హెచ్ 17 అధ్యక్షుడు బి. లక్ష్మణరావు, కార్యదర్శి టి.విష్ణుకుమార్‌రాజు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

17 నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలు

పాడేరురూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా తాత్కాలికంగా నిలిపిన ఎస్‌జీఎఫ్ డివిజన్ స్థాయి అండర్ 14, 17 విభాగం క్రీడలను శుక్రవారం(17వ తేదీ) నిర్వహించనున్నామని విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు తెలిపారు. మండల స్థాయిలో గెలుపొందిన క్రీడాకారుల ఎలిజిబుల్ ఫార్మ్, ఎండీఎం ఎక్విటెన్స్‌తో డివిజన్ స్థాయి క్రీడలకు హాజరుకావాలన్నారు. ఈ నెల 17న వాలీబాల్, చెస్ పోటీలను, 18న ఖో-ఖో, యోగ, 21న కబడ్డీ, షటిల్, 22న అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించనున్నామని తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు పాంగి సూరిబాబు 9441105964, కారు భవాని 9494005843 నంబర్లకు సంప్రదించాలన్నారు.

మినీ గురుకులాన్ని సందర్శించిన ఓఎస్‌డీ

- ప్రిన్సిపాల్‌ను బదిలీ చేస్తామని హామీ

పెదబయలు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పెదబయలు మండలంలోని గోమంగి మినీ గురుకులంలో గురుకులం ఓఎస్‌డీ మూర్తి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని మొత్తం 207 విద్యార్థులకు 170 మంది హాజరు కావడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో మిగతా విద్యార్థులను పాఠశాలకు చేర్చాలని తల్లిదండ్రులకు సూచించారు. ప్రిన్సిపాల్‌ను మార్చితేనే తమ పిల్లలను పాఠశాలకు పంపిస్తామని తల్లిదండ్రులు సమాధానమిచ్చారు. ప్రిన్సిపాల్ దండన విషయంలో పీవో ఎంక్వైరీ వేశారని, త్వరలో రిపోర్టు వచ్చాకా హెచ్‌ఎంను బదిలీ చేస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ప్రిన్సిపాల్ బాధ్యతలను సీఆర్‌టీ విగ్నేశ్వరమ్మకు అప్పగించినట్టు పేర్కొన్నారు.

దాసరిపుట్టు గ్రామానికి సీసీ రోడ్డు నిర్మించాలని వినతి

ముంచంగిపుట్టు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలో గల కరిముఖిపుట్టు పంచాయతీ దాసరపుట్టుకు సీసీ రోడ్డు నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ సందర్భంగా సీపీఎం మండల నాయకుడు జి.నారాయణ, గ్రామస్థులు మాట్లాడుతూ ఇది మట్టి దారి రహదారి కావడంతో చిన్నపాటి వర్షానికి బురదమయంగా మారుతోందని అన్నారు. ఈ విషయాన్ని పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం శూన్యమని అన్నారు. ఇప్పటికై అధికారులు స్పందించి సీసీ రోడ్డు వేయాలని కోరుతున్నారు.

కుంచంగికి చెందిన సీఆర్‌పీఎఫ్ ఉద్యోగి మృతి

కొత్తూరు, అక్టోబర్ 13 (ఆం ధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం కుంచంగి గ్రామానికి చెం దిన సీఆర్‌పీఎఫ్ ఉద్యోగి చిన్ని శ్రీనివాసరావు (51) బీహార్‌లో విధులు నిర్వహిస్తూ సోమవారం గుండెపోటుతో మృతిచెంది నట్టు అధికారులు ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గతంలో ఇతని సోదరుడు రామేశ్వరరావు సీఆర్‌పీఎఫ్‌లోనే విధులు నిర్వహించేవారు. ఎదురు కాల్పుల్లో వీరమరణం పొందడంతో అతని ఉద్యోగాన్ని శ్రీనివాసరావుకు ఇచ్చారు. ఇప్పుడు ఈయన కూడా మరణించడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఇతనికి భార్య, కుమార్తె ఉన్నారు. ఈ ఘటనపై గ్రామానికి చెందిన మాజీ సైనికుల సంఘం నాయకుడు పోలిన సూరిజగ్గారావు సం తాపం ప్రకటించారు. కాగా, శ్రీనివాసరావు మృతదేహాన్ని విమానంలో మంగళవారం స్వగ్రామమైన కుం చంగికి తీసుకు రానున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహిస్తామన్నారు.

'మెడికల్ కాంట్రాక్టు వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి'

అనకాపల్లి టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ కాంట్రాక్టు వర్కర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. సోమవారం ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద ధర్నా నిర్వహించి డీసీహెచ్‌ఎస్ డాక్టర్ శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ కృష్ణారావులకు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం శానిటేషన్ కార్మికుల శ్రమను దోచుకుంటుందన్నారు. జీతాలు సరిగా చెల్లించని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వడ్డాది అప్పలరాజు, చిందాడ లక్ష్మి, సత్యవతి, కాశీ తదితరులు పాల్గొన్నారు.

హామీలన్నీ అమలు చేశాకే ఏపీఐఐసీ భూముల్లో పనులు

» పలువురు రైతుల పట్టు » చినరాచపల్లిలో చెట్ల తొలగింపు అడ్డగింత



చినరాచపల్లిలో పనులు చేస్తున్న పొక్లెయిన్‌ను అడ్డుకున్న రైతులు

మాకవరపాలెం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : రామన్నపాలెం రెవెన్యూపరిధిలో ఉన్న ఏపీఐఐసీ భూముల్లో పనులను టీడీపీ నాయకులు, రైతులు సోమవారం అడ్డుకున్నారు. ఏపీఐఐసీ ఆధీనంలో సుమారు మూడు వందల ఎకరాలు ఉంది. ఈ భూములను గత పదిహేనేళ్ల నుంచి రైతులు సాగు చేసుకుంటున్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఇటీవల సదరు భూముల్లో కంపెనీ ఏర్పాటు కోసం చెట్ల తొలగింపు చేపడుతున్నారు. అయితే రామన్నపాలెం, చినరాచపల్లి, వెంకయ్యపాలెం గ్రామాలకు చెందిన పలువురు రైతులకు చెందిన పశువుల పాకలకు పరిహారం ఇంకా రాలేదు. అలాగే, రెండు సెంట్ల భూమి, అదనపు రూ.50 వేలు ప్యాకేజీ, చెట్లకు రావలసిన డబ్బులు పరిహారం ఇంకా అంద లేదు. దీంతో వీటిని ఇవ్వాలని ఆయా రైతులు డిమాండ్ చేశారు. అలాగే ఈ భూముల్లో రెండు చెరువుల కింద జిరాయితీ భూములు ఉన్నందున చెరువులను కప్పివేయవద్దని, చినరాచపల్లి, వెంకయ్యపాలెం గ్రామానికి వెళ్లే రోడ్డును తొలిగించవద్దని వారు డిమాండ్ చేశారు. భూములు తీసుకునేటప్పుడు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన తరువాతే ఏపీఐఐసీ భూముల్లో పనులు మొదలుపెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చుక్కా పోతురాజు, మాజీ ఎంపీటీసీ లక్ష్మీనాయుడు, టీడీపీ నాయుకులు ఏకా రాము, హరిచంద్ర తదితరులతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

నకిలీ మద్యంపై సీబీఐతో విచారణ జరిపించాలని ధర్నా



ఎక్సైజ్ సీఐకి వినతి పత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేశ్

నర్సీపట్నం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : నకిలీ మద్యంపై సీబీఐతో విచారణ జరిపించాలని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఇక్కడి ఎక్సైజ్ స్టేషన్ ముందు కార్యకర్తలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం షాపులు, పర్మిట్ రూమ్‌లు, బెల్టు షాపులు, బార్లలో ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేసి, నకిలీ మద్యంపై వాస్తవాలు బయటకు తీయాలన్నారు. నకిలీ, కల్తీ మద్యం కారణంగా చనిపోయిన వారిని గుర్తించి, వారి కుటుంబా లను ఆదుకోవాలని, మద్యం షాపులను ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు. అనంతరం సీఐ సునీల్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, ఎంపీపీ సుర్ల రాజ్యలక్ష్మి, వైస్ ఛైర్మన్ తమరాన నాయుడు, ఏకా శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అర్జీపై ప్రత్యేక దృష్టి

» ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు ఆర్డీవో రమణ ఆదేశం



ప్రజల నుంచి అర్జీలను అందుకుని సమస్యలు వింటున్న ఆర్డీవో వీవీరమణ

నర్సీపట్నం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక దృష్టికి వచ్చిన ప్రతి అర్జీపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆర్డీవో వీవీ రమణ ఆదేశించారు. సోమవారం ఇక్కడి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా పదిహేడు అర్జీలందాయి. డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రతి ఒక్కరితో ఆర్డీవో మాట్లాడారు. రోలుగుంట మండలం శరభవరం రెవెన్యూ పరిధిలో నల్లరాయి క్వారీలో బ్లాస్టింగ్ వలన ఇళ్లు దెబ్బతింటున్నాయని బి.రామలక్ష్మి ఫిర్యాదు చేశారు. ఇదే మండలం కొత్తూరు పంచాయతీ గొల్లపేటలో మంచినీటి పథకానికి సంబంధించిన మోటారుకు విద్యుత్ సౌకర్యం కల్పించక పోవడంతో నిరుపయోగంగా మారిందని తెలిపారు. దీంతో గ్రామస్థులు కలుషిత నీటిని తాగున్నారని మేలుం చిన్నరాజుబాబు విన్నవించారు. అలాగే, మాకవరపాలెం అన్‌రాక్ కంపెనీ కోసం భూములు, ఇళ్లు ఇచ్చామని, ఏపీఐఐసీ నుంచి ఇంటికి నష్ట పరిహారం ఇచ్చి, ప్రత్యామ్నాయంగా పునరావస కాలనీలో స్థలం ఇవ్వలేదని రామన్నపాలేనికి చెందిన చుక్క ఎర్రినాయుడు ఫిర్యాదు చేశారు. నర్సీపట్నం మునిసిపాలిటీ పరిధి 20వ వార్డు బలిఘట్టంలో దేవాంగులవీధి, మరిడిమహాలక్ష్మి వీధి, పల్లిపురానికి చెందిన 60 మంది రేషన్ లబ్ధిదారులను బయ్యపురెడ్డిపాలెంలోని 21 చౌకదుకాణంలో కలపడం వలన సరకులు తెచ్చు కునేందుకు ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. తమ రేషన్ కార్డులు బలిఘట్టం 19, 20, 45 చౌకదుకాణాల పరిధిలో సర్దుబాటు చేయాలని కౌన్సిలర్ మూలపర్తి రామరాజు ఆధ్వర్యంలో పలువురు మహిళలు విజ్ఞప్తి చేశారు. మాకవరపాలెం మండలం వజ్రగడ పంచాయతీకి సంబంధించి 2020- 2025 మధ్య వరకు జరిగిన జమ, ఖర్చుల వివరాలు ఇప్పించాలని తమరాన గోవిందరావు కోరారు. మరికొంత మంది ఆర్డీవో దృష్టికి సమస్యలను తీసుకువెళ్లారు. వీటన్నింటినీ ఆయా శాఖలకు పంపుతున్నట్టు అధికారులు తెలిపారు.

పట్టుబడిన రేషన్ బియ్యం బహిరంగ వేలం నేడు

నాతవరం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు 6-ఎ కేసులో పట్టుబడిన 215 క్వింటాళ్ల ప్రజా పంపిణీ బియ్యాన్ని మంగళవారం వేలం వేయనున్నట్టు తహశీల్దార్ ఎ.వేణుగోపాల్ తెలిపారు. గత నెల 25వ తేదీన పట్టుబడిన ఈ బియ్యాన్ని ఇప్పటి వరకు డి.యర్రవరం గోడౌన్‌లో భద్రపరిచినట్టు చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డి.యర్రవరం సివిల్ సప్లై గోడౌన్ వద్ద బహిరంగ వేలం వేస్తున్నట్లు విరించారు. పూర్తి సమాచారం కోసం సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ 94937 47308 నంబరులో సంప్రదించాల్సిందిగా సూచించారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవ ర్యాలీ

నర్సీపట్నం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బాలికా దినోత్సవంలో భాగంగా సోమవారం ఇక్కడ ర్యాలీ నిర్వహించారు. తొలుత సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆర్డీవో వీవీ రమణ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు వీరిని విద్యావంతులుగా తీర్చిదిద్ది ఉన్నత శిఖరాలను చేరుకునేలా ప్రోత్సహించాలన్నారు. అనంతరం బాల్య వివాహాల వల్ల అనర్థాలు తదితరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వీరజ్యోతి, ఐసీడీఎస్ సీడీపీవో జీవీ రమణ, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండు మండలాల్లో భారీ వర్షం

» లోతట్టు ప్రాంతాలు జలమయం » రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్న జనం



నర్సీపట్నం మెయిన్ రోడ్డులో భారీగా వర్షం కురుస్తున్న దృశ్యం

నర్సీపట్నం/నర్సీపట్నం అర్బన్/ కృష్ణాదేవిపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఉపరితల ఆవర్తనం కారణంగా పలు మండలాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఆకాశంలో కారుమబ్బులు కొన్నాయి. పదిగంటల సమయంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఉరుములు, మెరుపులతో మధ్యాహ్నం వరకు ఏకధాటిగా వర్షం పడింది. దీంతో లోతట్టు ప్రాంతాల జలమయమయ్యాయి. నర్సీపట్నంలోని ఎస్‌కేపీటీ సెంటర్, ఆర్టీసీ కాంప్లెక్స్ ఏరియా, బ్యాంక్ కాలనీ, వెంకునాయుడుపేట, శారదా నగర్, శివపురం తదితర ప్రాంతాల్లో వర్షపునీరు రోడ్లపై నిలిచిపోవడంతో జనం అవస్థలు పడ్డారు. అలాగే, మండలంలోని చెట్టుపల్లి, వేములపూడి, పెదబొడ్డేపల్లి, ఎల్.పురం, నీలంపేట, గబ్బాడ, తదితర గ్రామాల్లో భారీ వర్షానికి ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయింది. పలురోడ్లు చిత్తడిగా మారడంతో రాకపోలకు గ్రామీణులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదిలావుంటే, గొలుగొండ మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం రాత్రి నుంచి సోమవారం వరకు భారీ వర్షం కురిసింది. దీంతో గెడ్డలు, చెరువుల్లో జలకళ సంతరించుకుంది. పాత కృష్ణాదేవిపేట, ఏఎల్‌పురం, లింగంపేట, గింజర్తి, సీహెచ్. నాగాపురం, విప్పలపాలెం, పల్లావూరు తదితర గ్రామాల్లో కాలువల్లో మురుగు రోడ్లపై ప్రవహించింది. ముఖ్యంగా సోమవారం కృష్ణాదేవిపేటలో జరిగిన వారపు సంతకు విచ్చేసినవారు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వ్యాపారాలు సాగక వ్యాపారులు డీలా పడ్డారు. అయితే ఈ వర్షం రబీవరి సాగుకు ఎంతో ఉపయోగపడుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

డ్రోన్ ద్వారా కషాయాల పిచికారీతో ప్రయోజనాలు



కొత్తఎల్లవరంలో డ్రోన్ ద్వారా కషాయాల పిచికారీ దృశ్యం

గొలుగొండ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయంతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని మండల వ్యవసాయాధికారిణి సుధారాణి అన్నారు. మండలంలోని కొత్తఎల్లవరం గ్రామంలో రైతులకు సోమవారం ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో తయారు చేసిన కషాయాలను డ్రోన్ ద్వారా పిచికారీ చేయడం వల్ల ఎకరానికి రూ. 1500 ఆదా చేసుకోవచ్చునన్నారు. ప్రస్తుతం కూలీల కొరత ఉన్న నేపథ్యంలో డ్రోన్ పిచికారీ వ్యవస్థ రైతులకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఇటువంటి అవకాశాలను రైతులంతా సద్వినియోగం చేసుకుని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొల్లు రాంబాబు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ సిబ్బంది నిరసన



నల్ల బ్యాడ్జీలతో సిబ్బంది నిరసన

గొలుగొండ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : వైద్యులు చేపడుతున్న సమ్మెకు మద్దతుగా గొలుగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సిబ్బంది సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి సంఘీబావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యుల సమస్యలపై ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పకీర్ నాయుడు, ప్రమీళ, తదితరులు పాల్గొన్నారు.

ఓటు చోరీపై సంతకాల సేకరణ



సమావేశంలో మాట్లాడుతున్న కొండలరావు

మాడుగుల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఓటు చోరీకి వ్యతిరేకంగా సోమ వారం స్థానిక బస్టాండ్ ఆవరణలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతకాలను సేకరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మాడుగుల నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల కొండలరావు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ బీజేపీకి తొత్తుగా వ్యవహరించిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు యేసు రాజు, పిల్లా అప్పారావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

శివలింగాలు, నందీశ్వరుల విగ్రహాల ప్రతిష్ఠ



శివలింగాలు, నందీశ్వరుల విగ్రహాల ప్రతిష్ఠ చేస్తున్న గ్రామస్థులు

రావికమతం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పంచాయతన శివాలయం ప్రహారీపై 54 శివలింగాలు, 54 నందీశ్వరుల విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు స్వర్గీయ రాచకొండ ఆంజనేయమూర్తి జ్ఞాపకార్థకంగా ఆలయ ప్రధాన అర్చకులు ఆర్.లక్ష్మీనారాయణ ఈ విగ్రహాల ప్రతిష్ఠా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ ముక్కా మహాలక్ష్మినాయుడు, ఉప సర్పంచ్ గంజి మోదునాయుడు, టీడీపీ నాయకులు వేపాడ నాగేశ్వరావు, ఎం. జోగేశ్వరావు, జనసేన నాయకులు గంజి శ్రీను, ప్రముఖ వ్యాపార వెత్త బండారు రాజారావు, బండారు రమేష్, వెంకటగిరి తదితరులు పాల్గొన్నారు.

'సుప్రీంకోర్టు సీజేపై దాడిచేసిన వారిని శిక్షించాలి'

చీడికాడ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు అన్నారు. మండలంలో జైతవరం మహాజన సోషలిస్ట్ పార్టీ మండల నాయకులు మారడపూడి నాగరాజు ఆధ్వర్యంలో సోమవారం ఎంఆర్‌పీఎస్ కార్యకర్తలు నిరసన తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ నాయకులు చెవ్వేటి వెంకటరావు, మండల అధ్యక్షుడు రావాడ దేముడుబాబు, కంటిపాము మంగయ్య, ఈశ్వరరావు, సంతోష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జీవన ఎరువులపై రైతులకు అవగాహన



జీవన ఎరువులపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

రావికమతం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటలకు జీవన ఎరువులు వినియోగిస్తే ఎంతో మేలని కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎన్. రాజీకుమార్ అన్నారు. మండలంలోని మత్స్యవానిపాలెంలో సోమవారం కేవీకే శాస్త్రవేత్తల బృందం జీవన ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీకుమార్ మాట్లాడుతూ, రైతులు జీవన ఎరువులు ఉపయోగించడం వలన కలిగే లాభాలు, వాటి విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్ర వేత్తలు డాక్టరు ఎ. సౌజన్య, డాక్టరు ఎన్. సత్తిబాబు, డాక్టర్. ఎన్. కిషోర్ కుమార్, డాక్టర్ పి.బాబు, ఆర్‌ఈడబ్ల్యూఏపీ విద్యార్థులు,రైతులు పాల్గొన్నారు.

కుండపోత వర్షం



రావికమతంలో కురుస్తున్న వర్షం

రావికమతం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కుండపోతగా వర్షం కురిసింది. ఈ వర్షంతో వరి, చెరకు, సరుగుడు, జీడిమామిడి పంటలకు మేలు చేస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత నెలలో కురిసిన వర్షాలకు మండలంలో 2,181 హెక్టారులలో రైతులు వరి సాగు చేపట్టారు. ఈ వర్షం వరికి మేలు చేస్తుందని రైతులు తెలిపారు.

చీడికాడలో..

మండలంలో సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ భారీ వర్షం కురిసింది. ఉదయం ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12గంటల వరకూ ఏకధాటిగా వర్షం పడింది. ఈ వర్షం తో రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

బుచ్చెయ్యపేటలో..

మండలంలో సోమవారం భారీగా వర్షం కురిసింది. ఉదయం పది గంటల నుంచి 12 గంటల వరకు కుండపోతగా వర్షం కురిసింది. దీంతో వరి పొలాల్లో కలుపు తీసివేత పనులకు ఆటంకం ఏర్పడింది. జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. వరి చేలు పొట్ట దశలో ఉన్నాయని, తగినంత నీరు అవసరమని రైతులు తెలిపారు.

మాడుగుల రూరల్‌లో..

మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం మోస్తరు వర్షం పడింది. ఉదయం ఎనిమిదిన్నర గంటలకు జల్లులతో ప్రారంభమై మోస్తరు వర్షం పడింది. ఆ తరువాత వర్షం తగ్గి వాతావరణం తెరిపిచ్చింది. ఉదయమే వర్షం పడడంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు ప్రయాణానికి ఇబ్బంది పడ్డారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు : ఎంపీపీ

మాడుగుల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి):ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలేఇ ఎంపీపీ తాళ్లపురెడ్డి రాజారాం అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్‌అండ్‌బీ రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నా సంబంధిత శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వడ్డాది నుంచి తాటిపర్తి వరకు అడుగడుగునా భారీ గోతులు ఉన్నాయని, వాటిని పూడ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. అలాగే మాడుగుల ఆసుపత్రిలో వైద్యులు కొరత ఉన్నప్పటికీ పాలకులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ సందర్భంగా అధికార, విపక్షాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు పొలిమేర విజయలక్ష్మి, శ్రీనివాసరావు, ఎంపీడీవో కొంకి అప్పారావు, తహశీల్దార్ కింతలి రమాదేవి, ఏఎంసీ ఛైర్మన్ పుప్పాల అప్పలరాజు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులు



నూతన ఉపాధ్యాయులను విధుల్లో చేర్చుకుంటున్న ఎంఈఓ జాన్‌ప్రసాద్

రోలుగుంట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ పాఠశాలకు కేటాయించిన నూతన ఉపాధ్యాయులు సోమవారం విధుల్లో చేరారు. మండలానికి 21 పోస్టులను కేటాయించగా.. ఇందులో తొలిరోజు 15 మంది నూతన ఉపాధ్యాయులు విధుల్లో చేరినట్టు ఎంఈఓ జాన్ ప్రసాద్ తెలిపారు. ముగ్గురు ఎస్టీటీలను ఎంఈఓ జాన్‌ప్రసాద్ జాయినింగ్ ఆర్డర్‌లను తీసుకుని పాఠశాలను కేటాయించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న వరి పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు



వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఏవో

కె.కోటపాడు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరెడ్డిపాలెంలో తెగులు సోకిన వరి పంటను సోమవారం అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. గ్రామానికి చెందిన ఈర్లే దేముడుకు చెందిన 40 సెంట్లు భూమిలో పెన్నాసోనా అనే కొత్త వరి రకం వేశారు. చుట్టుపక్కల అన్ని పొలాలు బాగున్నా.. ఈ పెన్నా సోనా అనే రకం పూర్తిగా తెగులు సోకి పాడైంది. ఈ విషయమై వివిధ దినపత్రికల్లో రావడంతో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ భవాని, డాక్టర్ చంద్రశేఖర్, స్థానిక వ్యవసాయాధికారి సోమశేఖర్ సూరెడ్డిపాలెం పంట పొలాలను సోమవారం పరిశీలించారు. పెన్నా సోనా వరి రకం ఈ ప్రాంతానికి అనువు కాదని, భవిష్యత్తులో ఈ రకం ఈ ప్రాంతంలో వేయొద్దని సూచించారు. నీరు బయటకు వెళ్లే మార్గం లేక పోషకాలు వరి పంటకు అందడం లేదన్నారు. పంటకు ఎక్కువగా సుడిదోమ పట్టిందన్నారు. సుడిదోమ నివారణకు ట్రైఫూమిజో ఫైరం అనే మందును స్ప్రే చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వీఏఏ జనార్దన్, రైతులు నాయనప్ప, జామి సూర్యనారాయణ, సూరెడ్డి నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కల్తీ మద్యం విక్రయాలకు అడ్డుకట్ట వేయండి

» మాజీ మంత్రి అమర్‌నాథ్



ఎక్సైజ్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న అమర్‌నాథ్, వైసీపీ నాయకులు

చోడవరం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కల్తీ మద్యం విక్రయాలకు ప్రభుత్వం అడ్డుకట్ట వేయాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించి, ఎక్సైజ్ సీఐకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కల్తీ మద్యాన్ని ప్రభుత్వమే ప్రోత్సహిస్తూ, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతుందని విమర్శించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఏడువాక సత్యారావు, ఎంపీపీ గాడి కాసులమ్మ, ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

22 నుంచి కుసర్లపూడిలో జిల్లా స్థాయి భజన పోటీలు

రోలుగుంట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుసర్లపూడిలో ఈనెల 22వ తేదీ నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు జిల్లా స్థాయి భజన పోటీలను నిర్వహిస్తున్నట్టు గ్రామ మాజీ సర్పంచ్ గండి సింహాద్రి, గండి తాతాజీ తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా స్థానిక పాకలపాటి గురువు ఆశ్రమం వద్ద జిల్లా స్థాయి పోటీలను నిర్వహిస్తామన్నారు. ఇందులో పాల్గొనే భజన బృందాలు రూ.200లు ప్రవేశ రుసుమును చెల్లించాలని, సంప్రదాయ దుస్తులు ధరించి రావాలని కోరారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.10,000, ద్వితీయ బహుమతి రూ.5,000వేలు, తృతీయ బహుమతి రూ.3,000వేలు చొప్పున ఇవ్వనున్నట్టు తెలిపారు. ప్రతీ బృందానికి దూరం బట్టి రవాణా ఖర్చులు ఇవ్వనున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు రూ.9652903163, 9441039181 లలో సంప్రదించాలని కోరారు.

ఇకపై తహశీల్దార్ కార్యాలయంలో పీజీఆర్ఎస్

రావికమతం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం తన కార్యాలయంలో ఇకపై ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తామని తహశీల్దార్ అంబేడ్కర్ తెలిపారు. ఇకపై అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు కూడా పీజీఆర్ఎస్‌లో అందుబాటులో ఉంటారన్నారు. ఇచ్చిన ప్రతి అర్జీకి ఆన్‌లైన్ రశీదు ఇస్తామన్నారు. దీనిని ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

పీజీఆర్ఎస్‌లో అర్జీల స్వీకరణ

బుచ్చెయ్యపేట అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ముఖ్యంగా రెవెన్యూ, పెన్షన్ సమస్యలపై అర్జీలు అందాయని తహశీల్దార్ ఎం. లక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివప్రసాద్ నారాయణ, హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు, ఏపీఎం రాజుబాబు, ఏపీవో వరహాలబాబు, అదనపు ఎస్ఐ భాస్కరరావు, ఈపీడీసీఎల్ ఏఈ సోమరాజు పాల్గొన్నారు.

చింతలపూడికి రేషన్ డిపో మంజూరు చేయండి

దేవరాపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపూడి పంచాయతీకి రేషన్ డిపో మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న ఆధ్వర్యంలో సోమవారం సచివాలయ సిబ్బందికి గ్రామస్థులు వినతిపత్రం ఇచ్చారు. ఈసందర్భంగా వెంకన్న మాట్లాడుతూ పంచాయతీలో 385 రేషన్ కార్డులు ఉన్నాయని, పంచాయతీ ప్రజలు 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న తామరబ్బ డిపోకు వెళ్లవలసి వస్తున్నదన్నారు. ప్రతి నెలా నిత్యావసరాలు తేవాలంటే తిప్పలు తప్పవన్నారు. మండల కార్యదర్శి బీటీ.దొర తదితరులు పాల్గొన్నారు.

బీఎన్ రోడ్డులో ఎన్ని అవస్థలో..

» గోతుల్లో కూరుకుపోయిన లారీ



మేడివాడ వినాయక గుడి సమీపంలో గోతిలో కూరుకుపోయిన లారీ

రావికమతం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బీఎన్ రోడ్డులోని మేడివాడ వినాయక గుడి వద్ద సోమవారం సాయంత్రం సిమెంట్ ఇటుకల లోడుతో వస్తున్న లారీ గోతుల్లో కూరుకుపోయింది. ఇక్కడ ఉన్న భారీ గోతుల్లో ఇటీవల కురిసిన వర్షాలకు నీరు చేరింది. దీంతో ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామస్థులు శ్రమదానంతో సోమవారం ఉదయం మట్టితో గోతులను పూడ్చారు. అయితే సోమవారం భారీ వర్షం కురవడంతో మట్టి బురదమయంగా మారి లారీ అందులో కూరుకుపోయింది.

ఈత పోటీల్లో మత్స్యకార యువకునికి ఐదు పతకాలు

రాంబిల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో మండలంలోని వాడనర్సాపురం గ్రామానికి చెందిన మత్స్యకార యువకుడు మైలపల్లి శ్రీనివాస్ ఐదు పతకాలు సాధించాడు. ఈ నెల 11న గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి ఈత పోటీల్లో ఒక్కొక్క పసిడి, రజత పతకాలను, 12వ తేదీన మంగళగిరిలో జరిగిన 7వ జాతీయ పోటీల్లో ఒక్కొక్క పసిడి, రజత, కాంస్య పతకాలను సొంతం చేసుకున్నాడు.


ఈత పోటీల్లో సాధించిన పతకాలతో మైలపల్లి శ్రీనివాసరావు

ఉపాధి కూలీల ఈ-కేవైసీ త్వరగా పూర్తి చేయాలి

» కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం

అనకాపల్లి కలెక్టరేట్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కూలీలకు నవంబరు నుంచి ముఖ ఆధారిత హాజరు తప్పనిసరి అయినందున ఈలోగా ఈ-కేవైసీ పూర్తి చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఉపాధి హామీ పథకంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నవంబరు నుంచి ఉపాధి కూలీలకు హాజరు వేయాలన్నా, కూలి డబ్బులు మంజూరు కావాలన్నా ముఖ ఆధారిత హాజరు తప్పనిసరి అని స్పష్టం చేశారు. ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకుని మేజిక్ డ్రైన్ నిర్మించాలని సూచించారు. ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా ఇళ్ల లబ్ధిదారుల్లో ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు ఉన్న కుటుంబానికి 90 రోజులపాటు ఇంటి నిర్మాణ పనిదినాలు కల్పించాలని తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద రెండు వేల ఎకరాల్లో పండ్ల మొక్కలు నాటాలన్నది లక్ష్యం కాగా.. 2,050 ఎకరాల్లో మొక్కలు నాటి లక్ష్యాన్ని అధిగమించామని ఆమె చెప్పారు. మొక్కల వివరాలను సంబంధిత యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన నీటికుంటల తవ్వకం, పశువుల షెడ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్, డ్వామా పీడీ పూర్ణిమాదేవి, డీపీఓ సందీప్, తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

... 5వ పేజీ తరువాయి

వెళ్లడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటన తరువాత కార్యాలయంలో విధులు నిర్వహించడానికి సిబ్బంది భయపడుతున్నారు.

కొత్తకోట పంచాయతీ కార్యాలయం భవనాన్ని సుమారు నాలుగున్నర దశాబ్దాల క్రితం నిర్మించారు. కాలక్రమేణా బలహీనంగా మారి శిథిలావస్థకు చేరింది. గోడలు బీటలు వారాయి. వర్షం పడితే శ్లాబ్ నుంచి చుక్కలుచుక్కలుగా నీరు కారుతున్నది. కొన్నిచోట్ల శ్లాబ్ పెచ్చులు ఊడిపోయి ఇనుప ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. సోమవారం ఉదయం విధులకు హాజరైన సిబ్బంది, ఇళ్ల పన్నుల వసూళ్ల నిమిత్తం గ్రామంలోకి వెళ్లారు. ఈ సమయంలో భారీ వర్షం కురిసింది. అప్పుడే గదుల్లో పలుచోట్ల శ్లాబ్ పెచ్చులు ఊడిపడ్డాయి. ఆ సమయంలో సిబ్బంది ఎవరు కార్యాలయంలో లేక పోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. పన్నుల వసూళ్ల కార్యక్రమం ముగించుకుని కార్యాలయానికి తిరిగి వచ్చిన సిబ్బంది, గదుల్లో కింద పడివున్న శ్లాబ్ పెచ్చులను చూసి ఖిన్నులయ్యారు.

కాగా గత ప్రభుత్వం కొత్తకోటను మూడు సచివాలయాలుగా విభజించి భవనాలు నిర్మాణాలు చేపట్టింది. అయితే బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ పనులు మధ్యలో ఆపేశారు. దీంతో సచివాలయాల సిబ్బంది కూడా పంచాయతీ కార్యాలయంలోనే విధులు నిర్వహిస్తున్నారు. శ్లాబ్ నుంచి తరచూ పెచ్చులు ఊడిపడుతుండడంతో విధులు నిర్వహించాలంటే భయంగా వుందని సిబ్బంది వాపోతున్నారు. బీటలు వారిన గోడల నుంచి రాత్రి పూట పాములు లోపలికి వస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు.

గడువులోగా అర్జీల పరిష్కారం


వృద్ధురాలి సమస్యను ఆలకిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్


అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

» అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం

అనకాపల్లి కలెక్టరేట్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజలు అందజేసిన అర్జీల్లో పేర్కొన్న సమస్యలు, ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీడీఆర్ఎస్‌లో డీఆర్వో వైన సత్యనారాయణరావుతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మొత్తం 240 అర్జీలు అందాయని, వాటిని పరిష్కార నిమిత్తం ఆయా శాఖలకు పంపించామన్నారు. ఒక సమస్యపై కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో అర్జీ అందజేస్తే.. అదే సమస్యపై మరోసారి అర్జీ ఇవ్వాల్సిన అవసరం రాకుండా సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

అనకాపల్లి రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో అందించిన అర్జీలకు సంబంధించి ఫిర్యాదులు, సమస్యలకు సత్వర పరిష్కారం చూపుతామని ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఆయన మాట్లాడుతూ, మొత్తం 55 ఫిర్యాదులు అందాయని, వీటిని నిర్ణీత సమయంలో పరిష్కరిస్తామని చెప్పారు. జిల్లా పోలీసు కార్యాలయానికి రాలేని వారు ఆన్‌లైన్‌లో కూడా ఫిర్యాదు చేయవచ్చునని ఎస్పీ వెల్లడించారు.

గూగుల్ రాకతో టెక్ విప్లవం

» మారనున్న ఏపీ ముఖచిత్రం

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు


బత్తుల తాతయ్యబాబు

అనకాపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన గూగుల్ టెక్ సంస్థ విశాఖకు రావడం నవ్యాంధ్రకు శుభపరిణామమని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతాయ్యబాబు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ విభజనకు ముందు ఉమ్మడి రాజధాని హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్‌ని తీసుకొచ్చి సైబర్ సిటీని అభివృద్ధి చేసిన నారా చంద్రబాబునాయుడు.. ఇప్పుడు విశాఖకు గూగుల్‌ను తీసుకొచ్చి ఏపీ ముఖచిత్రాన్ని మార్చనున్నారని అన్నారు. నాడు మైక్రోసాఫ్ట్ రాకతో టెక్ అభివృద్ధికి హైదరాబాద్ గేమ్ చేంజ్ ఎలా అయ్యిందో, ఇప్పుడు గూగుల్ రాకతో విశాఖపట్నం గేమ్ చేంజర్ అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దుష్టశక్తులు ఎన్నివిధాలుగా అడ్డుపడినా.. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులు, తద్వారా జరిగి అభివృద్ధి ఆగదని ఆయన పేర్కొన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడుల కంటే కూటమి అధికారంలోకి వచ్చిన 16 నెలల్లోనే అంతకన్నా ఎక్కువ పెట్టుబడులు రావడం గొప్ప విషయమన్నారు. రాష్ట్రానికి రూ.11.2 లక్షల కోట్లు పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా 9.5 లక్షల మందికి ఉద్యోగాలు లభించే అవకాశం వుందని తాతయ్యబాబు పేర్కొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణకు యత్నం

» అడ్డుకున్న రెవెన్యూ సిబ్బంది


ప్రభుత్వ భూమిలో నాటిన మొక్కలను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

మాకవరపాలెం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించేందుకు యత్నించగా తహశీల్దార్ జి.వెంకటరమణ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది సోమవారం అడ్డుకున్నారు. తామరం రెవెన్యూలోని 61/3 సర్వే నంబరులో 21 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. 2013లో ఈ భూమిని ఆక్రమించేందుకు కొందరు ప్రయత్నించగా అప్పటి తహశీల్దార్ గంగాధర్ స్థానిక వీఆర్వోని సస్పెండ్ చేసి బాధ్యులపై క్రిమినల్ కేసులు పెట్టారు. అప్పటి నుంచి ఈ భూమి ప్రభుత్వం ఆధీనంలోనే ఉంది. గతంలో ఈ భూమిని క్రీడా మైదానం ఏర్పాటు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అయితే అప్పట్లో క్రిమినల్ కేసుల్లో ఉన్నవారే మళ్లీ ఇదే భూమిలో ఆదివారం ఎక్స్‌కవేటర్లతో గోతులు తవ్వి మొక్కలు పాతడం మొదలుపెట్టారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు సోమవారం అక్కడికి వెళ్లి సుమారు 300లకు పైగా జీడి మొక్కలను తొలగించి రెవెన్యూ కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ వెంకటరమణ మాట్లాడుతూ ఈ భూమిలో ఆక్రమణకు ప్రయత్నించినా, మొక్కలు నాటినా వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ చక్రపాణి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వేతన బకాయిలు విడుదల చేయాలి

» భోజన పథకం, పాఠశాలల శానిటేషన్ కార్మికుల డిమాండ్



డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న భోజన పథకం, పాఠశాలల శానిటేషన్ కార్మికులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, స్కూల్ శానిటేషన్ కార్మికుల బకాయి వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీఐటీయూ అనుబంధ మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం ఆధ్వర్యంలో డీఈవో కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి మాట్లాడుతూ, కార్మికులకు ప్రతి నెలా సకాలంలో వేతనాలు అందడం లేదని, దీనివల్ల ఆయా కార్మికులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. అదే విధంగా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు కూడా బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతున్నదని, కార్మికులు అప్పులు చేసి భోజనం వండి పెట్టాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి కార్మికులకు బకాయిలు విడుదల చేయాలని, ప్రమాద బీమా సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతన చట్టాలన్ని అమలు చేయాలని, వంట గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని ఆమె డిమాండ్ చేశారు. అనంతరం డీఈవో కార్యాలయం అధికారికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, సుభద్ర, ఎస్కే బీబీ, జానకి, శివలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

275 కిలోల గంజాయి పట్టివేత

... 5వ పేజీ తరువాయి

చీడికాడ మండలం కోనాం మీదుగా చోడవరం ప్రాంతానికి చేరుకున్నారు. ఆదివారం సాయంత్రం సీఐ బి.అప్పలరాజు ఆధ్వర్యంలో ఎస్ఐలు నాగకార్తీక్, జోగారావు మెయిన్ రోడ్డుపై వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ సమయంలో అటుగా వస్తున్న కారు, బైక్‌లను ఆపారు. దీంతో మోటారు సైకిళ్లపై వస్తున్న వారు వాహనాలను అక్కడి వదిలేసి పరారయ్యారు. కారులో వున్న వంతల దేవదాస్, చంద్రభాన్ బిష్ణోయితోపాటు, కారు డ్రైవర్ కొచ్చం సురేంద్రలను పోలీసులు పట్టుకున్నారు. కారులో తనిఖీ చేయగా ఎనిమిది బ్యాగుల్లో గంజాయి లభించింది. రెవెన్యూ సిబ్బంది సమక్షంలో తూకం వేసి 275 కిలోలు వున్నట్టు నిర్ధారించారు. కేసు నమోదు చేసి, నిందితులను అరెస్టు చేసి సోమవారం అనకాపల్లి ఎస్పీ కార్యాలయానికి తీసుకెళ్లారు. గంజాయి రవాణాకు వినియోగించిన కారుతో పాటు, పైలట్లు వచ్చిన రెండు మోటారు బైక్‌లను సీజ్ చేశారు. ఈ సందర్భంగా చోడవరం పోలీసులను ఎస్పీ అభినందించారు. మీడియా సమావేశంలో అనకాపల్లి డీఎస్పీ శ్రావణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎకనామిక్ జోన్‌కు 20,000 ఎకరాలు

... 5వ పేజీ తరువాయి

సమయంలో హామీ ఇచ్చిన విషయాన్ని ఆయన సమావేశంలో గుర్తుచేశారు. అందుకు తగ్గట్టుగా పరిశ్రమలు తీసుకువస్తామన్నారు. ఈ వారంలో ఆస్ట్రేలియా వెళ్లి అక్కడ ఒక కంపెనీతో చర్చించనున్నామని వివరించారు. వచ్చే నెలలో విశాఖలో నిర్వహించనున్న పెట్టుబడుల సదస్సులో మరికొన్ని కంపెనీలతో ఒప్పందాలు జరగనున్నాయన్నారు.

ఇదిలావుండగా విశాఖ జిల్లాలో 15 మాస్టర్ ప్లాన్ రహదారుల అభివృద్ధికి ఇప్పటికే వీఎంఆర్‌డీఏ అధికారులు నడుంబిగించారు. ఈ రోడ్లకు పొరుగు జిల్లాల నుంచి అనుసంధానం చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయనున్నారు. ఒక జిల్లాలో పరిశ్రమలు, మరో జిల్లాలో ఎయిర్‌పోర్టు, మరో జిల్లాలో భూములు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో నాలుగు జిల్లాల మధ్య అనుసంధానం కోసం గ్రేటర్ విశాఖ ఎకనామిక్ జోన్ ఏర్పాటుచేస్తున్నారు.

డ్రైనేజీ కాలువలు కబ్జా


.చోడవరం మండలం వెంకన్నపాలెంలో బీఎన్ రోడ్డు పక్కన కబ్జాకు గురైన డ్రైనేజీ కాలువ

... 5వ పేజీ తరువాయి

దారుణంగా తయారవుతున్నది. గోతులు మరింత పెద్దవి అవుతున్నాయి. రాళ్లు తేలిపోయి వాహనదారులతోపాటు పాదచారులు కూడా ఇబ్బంది పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు రాత్రిపూట ప్రమాదాలకు గురవుతున్నారు. భవిష్యత్తులో ఈ రోడ్డును అభివృద్ధి చేసినప్పటికీ ఆక్రమణలు తొలగించకపోతే సమస్య మరింత తీవ్రం అవుతుంది. కోట్లాది రూపాయలు వృథా అవుతాయి. ఆర్అండ్‌బీ అధికారులు వెంటనే స్పందించి వెంకన్నపాలెం నుంచి అంబేరుపురం వరకు రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలను తొలగించాలని, డ్రైనేజీ కాలువలు తవ్వించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

క్రైం... crime news

త్రుటిలో తప్పిన ప్రమాదం

» బురదలో కూరుకుపోయిన బస్సు


సంజీవపురం సమీపంలో రోడ్డు పక్కన బురదలో కూరుకు పోయిన బస్సు

దేవరాపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): దేవరాపల్లి-ఆనందపురం రోడ్డులో అనకాపల్లి వెళ్లే ఆర్టీసీ బస్సుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. సోమవారం ఈ మార్గంలో అనకాపల్లి వెళుతున్న పల్లె వెలుగు బస్సు ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి సంజీవపురం వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కన బురదలో కూరుకుపోయింది. ఆ సమయంలో బస్సులో 15 మంది ప్రయాణికులు ఉన్నారు. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. వారందరినీ వేరొక బస్సులో పంపించారు.

కానిస్టేబుల్‌పై దాడి చేసిన వ్యక్తికి జరిమానా

పరవాడ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై దాడి చేసిన వ్యక్తికి అనకాపల్లి 11వ అదనపు జూనియర్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ కోర్టు న్యాయమూర్తి ఎ.రమేశ్ రూ.3 వేల జరిమానా విధించారు. సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాల ప్రకారం.. 2019వ సంవత్సరంలో పరవాడ మండలం రావాడ వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. రావాడ గ్రామానికి చెందిన షేక్ చిన్నారావు అనే వ్యక్తి ట్రాఫిక్ కానిస్టేబుల్ పి.అచ్చింనాయుడుపై దాడికి పాల్పడ్డాడు. దీంతో పోలీసులు చిన్నారావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. కోర్టులో విచారణ సందర్భంగా.. ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై చిన్నారావు దాడి చేసినట్టు రుజువు అయ్యింది. దీంతో అతనికి రూ.3 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఒకవేళ జరిమానా చెల్లించని పక్షంలో రెండు నెలలపాటు సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలు చేసిన 5-6 గంటల్లోనే డబ్బులు

» పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

శ్రీకాకుళం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రైతులకు సహాయం, భరోసా, నమ్మకం కలిగించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం. ధాన్యం కొనుగోలు చేసిన కేవలం 5 నుంచి ఆరు గంటల్లోనే వారి ఖాతాల్లో సొమ్ము జమ చేస్తాం' అని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. సోమవారం శ్రీకాకుళంలో ఉత్తరాంధ్రలో ఆరు జిల్లాల అధికారులతో, రైస్ మిల్లర్లు, వివిధ రైతు సంఘాల ప్రతినిధులతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు పారదర్శకంగా ఉండాలని, గత ప్రభుత్వంలో జరిగిన తప్పులు పునరావృతం అయితే ఉపేక్షించేది లేదని రైస్‌మిల్లర్లను, అధికారులను హెచ్చరించారు. ధాన్యం తూకం విషయంలో రైతులకు అన్యాయం చేయొద్దని స్పష్టం చేశారు. ఉత్తరాంధ్రలో గత ఏడాది 11.45 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, ఈసారి 13 లక్షల టన్నులు కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎలమంచిలి విద్యార్థులు

ఎలమంచిలి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాస్థాయిలో నిర్వహించిన అండర్-14 స్కూలు గేమ్స్ హాకీ పోటీల్లో ఎలమంచిలి కొత్తపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబరిచారు. దీంతో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టులో స్థానం సంపాదించారు. విశాఖపట్నం పోర్టు స్టేడియంలో ఈ నెల 11వ తేదీన నిర్వహించిన జిల్లాస్థాయి హాకీ పోటీల్లో బాలురు విభాగంలో కొటారు లక్ష్మీమహేశ్, తెరపల్లి సంతోశ్‌కుమార్, నితీష్ వర్ధన్, విజయ్‌కుమార్, బాలికల విభాగంలో బి.సురేఖ, కె.ప్రణీతలు ఉత్తమ ప్రతిభ చూపారని హెచ్ఎం వైవీ రమణ తెలిపారు.

సాగునీరు పుష్కలం

... 5వ పేజీ తరువాయి

ఎంత నీరు వచ్చిచేరుతున్నదో.. ఇంచుమించుగా అంతేనీటిని కాలువల ద్వారా పొలాలకు విడిచిపెడుతున్నారు. దీంతో తాండవ జలాశయంలో నీటి మట్టం గరిష్ఠస్థాయికి నాలుగైదు అడుగుల దిగువన కొనసాగుతున్నది. రైవాడ జలాశయం గరిష్ఠ నీటిమట్టం 114 మీటర్లు కాగా సోమవారం 113.39 మీటర్ల వద్ద స్థిరంగా వుంది. తాండవ గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులు 376.5 అడుగులు వుంది. బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తన ప్రభావంతో రానున్న రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ సూచించడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. రిజర్వాయర్లలోకి వచ్చే వరదనీటికి అనుగుణంగా స్పిల్‌వే గేట్లు ఎత్తి అదనపు నీటిని దిగువకు విడిచిపెడతామని జిల్లా జలవనరుల శాఖ అధికారి త్రినాథం తెలిపారు.

అనకాపల్లి-నాందేడ్ ప్రత్యేక రైలు

... 5వ పేజీ తరువాయి

మీదుగా మహారాష్ట్రలోని నాందేడ్‌లో మరో ప్రత్యేక రైలు సర్వీసును అందుబాటులోకి తీసుకు వచ్చారు. ప్రతి మంగళవారం నాందేడ్ నుంచి, ప్రతి బుధవారం అనకాపల్లి నుం చి ఈ సర్వీసులు నడుస్తాయని స్థానిక రైల్వేస్టేషన్ మేనేజర్ నచ్చి నివాస్ తెలిపారు. 07037 నంబరుగల రైలు నాందే డ్‌లో ప్రతి మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంటకు బయలుదేరి బుధవారం ఉదయం 10 గంటలకు అనకాపల్లి చేరు తుంది. తిరుగు ప్రయాణంలో 07038 నంబరుతో ప్రతి బుధవారం అనకాపల్లిలో మధ్యాహ్నం 1.15 గంటలకు బయలుదేరి గురువారం ఉదయం పది గంటలకు నాందేడ్ చేరుతుంది. సెకండ్ క్లాస్ జనరల్, స్లీపర్, థర్డ్ ఏసీ బోగీలతో నడిచే ఈ రైలు ఎలమంచిలి, తుని, అన్నవరం, సామర్లకోట, రాజమహేంద్రవరం, తణు కు, భీమవరం, ఆకివీడు, కైకలూరు, గుడి వాడ, విజయవాడ, గుంటూరు, సత్తెన పల్లి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగుడ, నల్గొండ, చర్లపల్లి, మేడ్చల్, కామారెడ్డి, నిజామాబాద్, బాసర, ధర్మాబాద్ స్టేషన్లలో ఆగుతుంది. హైదరాబాద్/ సికింద్రాబాద్ వెళ్లే ప్రయాణికులు చర్లపల్లి లేదా మేడ్చల్‌లో దిగాలని, ఈ స్టేషన్ల నుంచి సికింద్రాబాద్ స్టేషన్‌కు లోకల్ రైళ్లలో వెళ్లవచ్చని ఆయన పేర్కొన్నారు. అనకాపల్లి నుంచి వచ్చే 26వ తేదీ వరకు ఈ ప్రత్యేక రైలు అందుబాటులో వుంటుందని చెప్పారు.

మైనింగ్‌లో అక్రమ దందా

... 5వ పేజీ తరువాయి

చేస్తున్నది. ఇంతవరకు బాగానే వున్నప్పటికీ ఆయా చెక్‌గేట్ల వద్ద నియమితులైన సిబ్బంది అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. నిబంధనల ప్రకారం గ్రానైట్, నల్లరాయి, మెటల్, గ్రావెల్, క్రషర్ బుగ్గిని రవాణా చేసే వాహనాలకు వే బిల్లు లేకపోతే అటువంటి వాహనాల నుంచి సీనరేజ్ వసూలు చేయాలి. అది కూడా ఆన్‌లైన్‌లో చెల్లించేలా చూడాలి. కానీ సీనరేజ్ వసూళ్ల కాంట్రాక్టు పొందిన కంపెనీకి చెందిన వ్యక్తులు క్వారీలకు చేరువలో చెకింగ్ పాయింట్‌లు ఏర్పాటు చేసి, వే బిల్లు వున్నా, లేకపోయినా నగదు రూపంలో డబ్బులు తీసుకుంటున్నారు. కాంట్రాక్టు పొందిన సంస్థ ముద్రించిన బిల్లులు కాకుండా చిన్న కాగితంపై రబ్బర్ స్టాంపు వేసి, దానిపై పెన్నుతో వాహనం నంబరు, తేదీ, సమయం, వసూలు చేసిన డబ్బులు, చెక్ పాయింట్ పేరు రాసి డ్రైవర్ల చేతిలో పెడుతున్నారు. వీటిపై కాంట్రాక్టు పొందిన సంస్థ పేరుగానీ, చిరునామాగానీ లేవు. కాంట్రాక్టు సంస్థే అక్రమవసూళ్లను ప్రోత్సహిస్తున్నదా? లేకపోతే కాంట్రాక్టు సంస్థకు తెలియకుండా సిబ్బందే అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారా? అన్నది మిస్టరీగా వుంది. నిబంధనల ప్రకారం సీనరేజ్ సొమ్మును ఆన్‌లైన్‌లో చెల్లించిన తరువాత, చెక్ గేటు సిబ్బంది బిల్లు ఉత్పన్నం చేయాలి. కానీ ఇక్కడ అటువంటిదేమీ జరగకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	510
విజయనగరం	514
శ్రీకాకుళం	514